www.vishalabharati.com
epaper:vishalabharati.com

సోమవారం, హైదరాబాద్
21 ఆగస్టు 2023
సంపుటి:1 సంచిక:307

# విశాల భారతి

తెలుగు దినపత్రిక



చంద్రయాన్ 3 ల్యాండింగ్ టైమ్ ఫిక్స్

- ప్రత్యక్ష ప్రసారాలకు ఏర్పాట్లు

2



# ఐటీ అభివృద్ధికి రాజీవ్ గాంధీనే కారణం..

**బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే**

- బీజేపీ దేశాన్ని దోచుకుంటుంటే.. బీఆర్ఎస్ రాష్ట్రాన్ని దోచుకుంటున్నాయి
- రెండు పార్టీలు డ్రామాలు ఆడుతున్నాయి
- మణిపూర్ మండుతుంటే బీజేపీ నేతలు మాట్లాడరెందుకు?
- పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి

**విశాలభారతి, హైదరాబాద్:**

దేశంలో ఐటీ అభివృద్ధికి మాజీ ప్రధాని రాజీవ్ గాంధీయే కారణమని పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని ఆరోపించారు. బీజేపీ దేశాన్నిదోచుకుంటుంటే.. బీఆర్ఎస్ రాష్ట్రాన్ని దోచుకుంటున్నాయని విమర్శించారు. రెండు పార్టీలు ప్రజలను మభ్య పెడుతున్నాయని మండిపడ్డారు. ఆదివారం ఆయన సోమాజిగూడలో మీడియాతో మాట్లాడారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి నివాళి అర్పించారు. దేశంలో గ్రామ పంచాయితీలను బలోపేతం చేసింది రాజీవ్ గాంధీయేనని కొనియారు. మహిళలకు రిజర్వేషన్లు కల్పించారని చెప్పుకొచ్చారు. 'సాంకేతిక విప్లవం తీసుకొచ్చింది రాజీవ్ గాంధీ. రాజీవ్ గాంధీ చేసిన కృషితోనే ఐటీ ఇంత అభివృద్ధి చెందింది.టెలికాం రంగంలో మార్పులు తెచ్చి అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చారు. పిన్న వయసులోనే ప్రధానిగా బాధ్యతలు చేపట్టి యువతకు ఆదర్శంగా నిలిచారు.పేదల కోసం ప్రాణ త్యాగం చేసిన కుటుంబం రాజీవ్ గాంధీ గారిది.' అంటూ రేవంత్ కొనియాడారు.





## మేం తల్చుకుంటే రూ. 5 వేలు

# పింఛన్ ఇవ్వలేమా?

రెండు వేలు చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమే కదా..

మళ్లీ గెలిచేది గులాబీ పార్టీయే..

త్వరలోనే పింఛన్ల పెంపుపై ప్రకటన

ఈసారి ఐదారు సీట్లు ఎక్కువే గెలుస్తాం

50 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ ఏం చేసింది?

కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎంత పింఛన్ ఇస్తున్నారు?

సూర్యాపేట సభలో సీఎం కేసీఆర్

**విశాలభారతి, సూర్యాపేట:**

తాము తలుచుకుంటే పింఛన్లు పెంచలేమా? అని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. గతంలో పింఛన్లు భారీగా పెంచింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. మళ్లీ గెలిచేది మేమేనని ధీమా వ్యక్తం చేశారు. త్వరలోనే పింఛన్ల పెంపు పై ప్రకటన చేస్తామని చెప్పారు. ఎన్నికలు రాగానే కొత్త బిచ్చగాళ్లు వచ్చి మాయమాటలు చెబుతారు.. ప్రజలు నమ్మొద్దని కేసీఆర్ విజ్ఞప్తి చేశారు. సూర్యాపేట జిల్లా కలెక్టరేట్, సమీకృత వ్యవసాయ మార్కెట్, జిల్లా ఎస్పీ కార్యాలయం, మెడికల్ కాలేజీ, బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయాన్ని సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన 'సూర్యాపేట ప్రగతి నివేదన సభ'లో సీఎం మాట్లాడారు. " కాంగ్రెస్, బీజేపీ నేతలు ఒక్క అవకాశం ఇవ్వాలని అడుగుతున్నారు. 50 ఏళ్లు అవకాశం ఇస్తే ఏం చేశారు. కాంగ్రెస్ పార్టీలో జిల్లాకు చెందిన చాలా మంది మంత్రులుగా పనిచేశారు. సూర్యాపేటను అభివృద్ధి చేశారా? సూర్యాపేట, భువనగిరి, నల్గొండలో మెడికల్ కాలేజీలు పెట్టాలని ఎప్పుడైనా అనుకున్నారా? సూర్యాపేట, నల్గొండ గతంలో ఎలా ఉన్నాయి? ఇప్పుడెలా ఉన్నాయి. ఎన్నికలు రాగానే కొత్త బిచ్చగాళ్లు వచ్చి మాయమాటలు చెబుతారు. ప్రజలు ఆగం కావొద్దు. రూ.4వేలు వృద్ధాప్య పింఛను ఇస్తామని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. వారు పాలిస్తున్న రాష్ట్రాల్లో రూ.4వేలు పింఛను ఇస్తున్నారా? కాంగ్రెస్ పార్టీలో రాష్ట్రానికో విధానం

..మిగతా |2| లో



## రియల్ ఎస్టేట్ సంస్థలా బీఆర్ఎస్ సర్కారు

- పేదల భూములు లాక్కొని పెద్దలకు
- ఎన్నికల ముందే అన్ని ఆస్తులు అమ్ముతున్నారు
- కేసీఆర్ కు ఓటమి భయం పట్టుకున్నది
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి

**విశాలభారతి, హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం ఓ రియల్ ఎస్టేట్ సంస్థలా మారిపోయిందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. పేదల భూములు లాక్కొని పెద్దలకు దారా దత్తం చేస్తున్నారని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల తర్వాత అధికారంలోకి రామన్న భయంతో ముఖ్యమంత్రి కేసీఆర్ దోపిడీకి తెరలేపారని ఆరోపించారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. నిర్మల్ పట్టణంలో సోఫినగర్ ఇండస్ట్రియల్ జోన్ను మాస్టర్ ప్లాన్ పేరుతో ప్రభుత్వం.. దాన్ని రెసిడెన్షియల్గా చేసేందుకు జీవో తెచ్చి రైతులుకు నష్టం కలిగించే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా వారం రోజుల నుంచి రైతులు, ప్రజలు ఆందోళన చేస్తుంటే బీజేపీ మద్దతు ఇస్తోందని చెప్పారు. 'గతంలో ఇదే సమస్యపై ఆందోళన చేస్తే.. ప్రభుత్వం వాయిదా వేసింది. ఇప్పుడు ఎన్నికల ముందు మళ్లీ తెరమీదకు

..మిగతా |2| లో



## లోయలో పడిన ఆర్టీసీ బస్సు

- ఇద్దరు దుర్మరణం

**విశాలభారతి, ఏపీ బ్యూరో:** అల్లూరి జిల్లాలోని పాడేరు ఘాట్ రోడ్డులో ఆదివారం సాయంత్రం ఘోర ప్రమాదం జరిగింది. ఆర్టీసీ బస్సు లోయలో పడిన ఘటనలో ఇద్దరు మృతి చెందారు. 30 మందికి గాయాలయ్యాయి. వీరిలో 10 మందికి తీవ్ర గాయాలయ్యాయి. విశాఖపట్నం నుంచి పాడేరు వెళ్తున్న పాడేరు డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సు ఘాట్ రోడ్డు వ్యూ పాయింట్ వద్ద అదుపు తప్పి ఏడు పల్టీలు కొట్టి 50 అడుగుల లోయలోకి దూసుకెళ్లింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 45 మంది ప్రయాణికులు ఉన్నారు. లోయలో పడిన బస్సు వద్దకు చేరుకుని క్షతగాత్రులను కాపాడేందుకు స్థానికులు తీవ్రంగా శ్రమించారు. అతి కష్టం మీద ప్రయాణికులను ప్రధాన రహదారిపైకి తీసుకొచ్చారు. పాడేరు వైపు నుంచి వస్తున్న మరో ఆర్టీసీ బస్సులో క్షతగాత్రులను పాడేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు చెట్టు కొమ్మలు రోడ్డుపైకి వాలిపోవటం, రహదారి పక్కన రక్షణ గోడలేకపోవడమే ప్రమాదానికి కారణమని ప్రయాణికులు ఆరోపించారు. ఘటనాస్థలిలో సెల్‌ఫోన్ సిగ్నల్ కూడా లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.



2 లో

అమెరికన్ ఫ్లాగ్ ఫుట్‌బాల్ నేషనల్స్ ప్రారంభం

## బీసీలకు 50 శాతం టికెట్లు ఇవ్వాలి

- ఇవ్వని పార్టీలను వచ్చే ఎన్నికల్లో ఓడించి తీరుతాం.
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య హెచ్చరిక.



**హైదరాబాద్, విశాల భారతి:** త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీలు బీసీలకు 50 శాతం టికెట్లు ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆదివారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో 13 బీసీ సంఘాల సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా కృష్ణయ్య

..మిగతా |2| లో



## కాకి చొక్కా వేసుకున్న గూండాలు పోలీసులు

- అర్ధరాత్రి మహిళను కొడతారా?

- తెలంగాణలో స్వాతంత్ర్యానికి విలువేంటి? .. పోలీసుల తీరు అమానుషం.
- గిరిజన మహిళ లక్ష్మికి న్యాయం జరగాలి
- వైఎస్ఆర్‌టీపీ అధినేత్రి షర్మిల

..మిగతా |2| లో



## తలసానిపై గిరిజన సంఘాల ఆగ్రహం

2 లో

- రాష్ట్రంలోని పలు చోట్ల దిష్టిబొమ్మల దహనం
- క్షమాపణ చెప్పాలంటూ హెచ్చరికలు
- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని డిమాండ్
- స్టీల్ బ్రిడ్జ్ ప్రారంభోత్సవంలో జాదవ్ రమేశ్ ను తోసేసిన మంత్రి
- సోషల్ మీడియాలో వీడియో వైరల్

# తలసానిపై గిరిజన సంఘాల ఆగ్రహం

**విశాలభారతి, హైదరాబాద్:**

తెలంగాణ ఉద్యమకారుడు రాజేశ్ బాబును రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అవమానించడంపై ఆగ్రహజ్వాలలు, నిరసన వ్యక్తమవుతున్నాయి. నిర్మల్ జిల్లా వ్యాప్తంగా గిరిజన సంఘాలు, తెలంగాణ ఉద్యమకారులు నిరసనకు దిగి, మంత్రి తలసాని దిష్టిబొమ్మ దహనాలు చేపట్టారు. రాజేశ్ బాబుకు మద్దతుగా పెద్ద ఎత్తున మద్దతు వస్తుండగా.. మంత్రి చేసిన చర్యను తప్పుబడుతున్నారు. క్షమాపణ చెప్పకుంటే.. రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు, ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

హైదరాబాదులో శనివారం (ఆగస్టు 19న) జరిగిన స్టీల్ బ్రిడ్జి ప్రారంభోత్సవం జరిగింది. అక్కడ మంత్రి కేటీఆర్ ప్రక్కన ముందుకు వెళ్తున్న భైంసా ఏఎంసీ మార్కెట్ కమిటీ చైర్మన్ జాదవ్ రాజేష్ బాబును మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అవమానించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నారు. మంత్రి తలసాని దిష్టిబొమ్మకు లోకేశ్వరం మండలం రాజేశ్ తండా, పుస్పూరుతో పాటు పలు గ్రామాల్లో శవయాత్ర నిర్వహించారు. పాడెకట్టి దిష్టిబొమ్మ పెట్టి.. డప్పు భాజాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించి.. దహనం చేసి తమ నిరసన తెలిపారు. నిర్మల్, భైంసా, ముధోల్, ఖానాపూర్ తో పాటు గ్రామాల్లోనూ గిరిజన సంఘాల నాయకులు, తెలంగాణ ఉద్యమకారులు దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని లోకేశ్వరం పోలీస్ స్టేషనులో ఫిర్యాదు చేశారు. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పని చేసిన రాజేశ్ బాబు కు రాష్ట్ర ఉద్యమకారులు అండగా నిలిచారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలంగాణ ఉద్యమకారులకు, గిరిజన జాతికి క్షమాపణ చెప్పాలని నిర్మల్ జిల్లా తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ అధ్యక్షులు డాక్టర్ రామకృష్ణ గౌడ్ డిమాండ్ చేశారు. గిరిజన నేత, ఉమ్మడి ఆదిలాబాద్ తెలంగాణ ఉద్యమకారుడు రాజేష్ బాబును నెట్టేసి, చెంపదెబ్బ కొట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. కేసీఆర్ హైదరాబాదులో అడుగు పెడితే ముక్కు నేలకు రాసిస్తాను.. హైదరాబాదు నుండి నీ ఇంటిని ఖాళీ చేయిస్తానన్న తెలంగాణ ఉద్యమ ద్రోహి తలసాని అని.. తెలంగాణ ఉద్యమం కోసం ఉద్యోగాన్ని తృణప్రాయంగా వదిలేన విద్యావంతుడు జాదవ్ రాజేష్ బాబును అవమానించటాన్ని తీవ్రంగా ఖండించారు ప్రముఖ న్యాయవాది అల్లూరి మల్లారెడ్డి. ఉద్యమ ద్రోహులను మంత్రివర్గం నుంచి తక్షణమే బర్తరఫ్ చేసి.. రాజేష్ బాబుకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో తెలంగాణ ఉద్యమకారులు సాదు రామ్ రెడ్డి, గోపి గంగన్న, నరసయ్య ఉద్యమకారులున్నారు. అధికార మదంతో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ గిరిజన నేత, తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుడు రాజేష్ బాబును నెట్టేసి.. చెంపదెబ్బ కొట్టడాన్ని లంబాడీ సంఘం తీవ్రంగా ఖండించింది. లంబాడా సంఘం జిల్లా సీనియర్ నాయకులు రాజేంధర్ హపావత్, లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు బానావత్ గోవింద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్ జాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి జాదవ్ రాజేందర్, బంజారా సేవ సంఘ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ రాజేందర్ నాయక్ మంత్రి తలసాని తీరును తప్పుపట్టారు. గిరిజన సమాజానికి తలసాని శ్రీనివాస్ క్షమాపణ చెప్పాలని.. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

# మేం తల్చుకుంటే రూ. 5 వేలు పింఛన్ ఇవ్వలేమా?

మొదటిపేజీ తరువాయి

ఉంటుందా?. మేం కూడా పింఛన్లు తప్పకుండా పెంచుతాం. పింఛన్లు ఎంతకు పెంచుతానో త్వరలోనే చెబుతా" అని సీఎం అన్నారు.

**బీఆర్ఎస్ విజయంపై అనుమానమే లేదు..**

"అంచెలంచెలుగా సంక్షేమ పథకాలు పెంచుకుంటూ పోతున్నాం. ఒక పార్టీ నాయకుడు మోటార్లకు మీటర్లు పెట్టాలంటాడు.. మరో పార్టీ నాయకుడేమో 3 గంటల కరెంటు చాలంటాడు. కాంగ్రెస్ గెలిచిన కర్ణాటకలో అప్పుడే విద్యుత్ కోతలు మొదలయ్యాయి. ఇవాళ తెలంగాణలో పండే వడ్లను తరలించేందుకు లారీలు సరిపోవట్లేదు. కాంగ్రెస్ ఆపద్బంధు పథకం, బీఆర్ఎస్ రైతు బీమాను పోల్చి చూడాలి. ఎవరి మధ్యవర్తిత్వం లేకుండా రైతు బంధు, రైతు బీమా డబ్బు ఖాతాలో పడుతోంది. ధరణి రద్దు చేస్తామని కాంగ్రెస్ పార్టీ చెబుతోంది. ధరణి పోర్టల్ తీసేస్తే రైతు బంధు, రైతు బీమా ఎలా వస్తుంది. ఒక్కసారి ధరణిలో భూమి నమోదైతే మార్చే మొనగాడు ఉన్నారా? మండల కేంద్రంలోనే 15 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ అయ్యేలా ధరణి తెచ్చాం. ఓటు అనే ఆయుధాన్ని బాగా ఆలోచించి వాడుకోవాలి. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 12 అసెంబ్లీ స్థానాలు బీఆర్ ఎస్ గెలవాలి. బీఆర్ఎస్ విజయంపై అనుమానమే లేదు. గత ఎన్నికలకంటే ఈసారి ఐదారు సీట్లు ఎక్కువే వస్తాయి" అని సీఎం కేసీఆర్ అన్నారు.



**సూర్యాపేటకు సీఎం కేసీఆర్ వరాలు..**

సూర్యాపేటకు సీఎం కేసీఆర్ వరాలు ప్రకటించారు. "ప్రతి గ్రామ పంచాయతీకి రూ.10లక్షలు, జిల్లాలోని 4 మున్సిపాలిటీలకు రూ.25 కోట్లు, సూర్యాపేట మున్సిపాలిటీకి రూ.50కోట్లు మంజూరు చేస్తున్నా. రూ.25 కోట్లతో సూర్యాపేటలో కళాభవన్ నిర్మిస్తాం. సూర్యాపేటలో ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ నిర్మించాలని మంత్రి ప్రశాంత్‌రెడ్డిని ఆదేశిస్తున్నా" అని సీఎం కేసీఆర్ తెలిపారు.



# కాకి చొక్కా వేసుకున్న గూండాలు పోలీసులు

**విశాలభారతి, హైదరాబాద్:**

తెలంగాణ పోలీసులపై వైఎస్సార్టీపీ అధినేత్రి షర్మిల సంచలన కామెంట్స్ చేశారు. పోలీసులు కాకీ చొక్కా వేసుకున్న గూండాలు అంటూ ఆరోపించారు. ఇటీవల హైదరాబాద్ లో ఓ గిరిజన మహిళను పోలీసులు కస్టడీలో కొట్టిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. తాజాగా షర్మిల మాట్లాడారు. గిరిజన మహిళ లక్ష్మి పై పోలీసుల దాడి అమానుషమని అభివర్ణించారు. అర్ధరాత్రి మహిళ స్వేచ్ఛగా తిరిగినప్పుడు మనకు అసలైన స్వతంత్రం అని మహాత్మా గాంధీ అంటే .. ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణలో స్వాతంత్ర్యం ఉందా? అని ప్రశ్నించారు. 'అర్ధరాత్రి మహిళ అని చూడకుండా స్వాతంత్ర్యం వచ్చిన రోజు ఈ అరాచకం చేశారు. ఇది ఏ గూండాలు చేసిన పనికి కాదు. రక్షణ గా ఉండాల్సిన పోలీసులు ఈ దారుణానికి పాల్పడితే స్వాతంత్ర్యాన్ని గౌరవించినట్లా ? ఈ పోలీసులకు రాజ్యాంగం అంటే గౌరవం లేదు. ఇండియన్ పీనల్ కోడ్ అంటే గౌరవం లేదు.' అంటూ షర్మిల ఫైర్ అయ్యారు.





# అమెరికన్ ఫ్లాగ్ ఫుట్‌బాల్ నేషనల్స్ ప్రారంభం

**-టైటిల్ ఫేవరెట్‌గా తెలంగాణ జట్టు.**

**హైదరాబాద్, విశాల భారతి :** అమెరికన్ ఫ్లాగ్ ఫుట్‌బాల్ నేషనల్స్ 2023 పోటీలను హైదరాబాద్‌లోని జింఖానా గ్రౌండ్స్‌లో ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ క్రీడలను శనివారం ఎల్ఐసీలో దేశంలోనే నెం.1 చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వైజర్ (సీఎల్ఐఏ), భారత జట్టు బ్రాండ్ అంబాసిడర్ కొటికె విఠల్ హాజరై ప్రారంభించారు. ఈసారి టైటిల్ ఫేవరెట్లలో తెలంగాణ జట్టు కూడా ఉంది. ఇప్పటికే ఇది కేరళ, హర్యానా జట్లను గ్రూప్ మ్యాచ్‌లలో ఓడించి, గ్రూపులో అగ్రస్థానానికి చేరుకుంది. మొత్తం 12 పురుషుల జట్లు, 8 మహిళల జట్లు ఈ పోటీలలో పాల్గొంటున్నాయి.

పురుషుల జట్లు : తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, పంజాబ్, చండీగఢ్, ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్, ఢిల్లీ, హర్యానా.

మహిళల జట్లు: రాజస్థాన్, ఢిల్లీ, కర్ణాటక, కేరళ, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, పంజాబ్, చండీగఢ్.

నేషనల్స్‌లో వారి ఆటతీరును బట్టి భారత జట్టుకు క్రీడాకారులను ఎంపిక చేస్తారు. అలా ఎంపికైనవారు అక్టోబర్ నెలలో మలేషియాలో జరిగే ఏషియన్ ఓషియానిక్ ఛాంపియన్‌షిప్‌లో భారతదేశం తరపున ఆడతారు. భారత జట్టు గతంలో 2018, 2021 సంవత్సరాల్లో వరల్డ్ ఛాంపియన్‌షిప్స్‌లో పాల్గొంది. అమెరికన్ ఫుట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు అంతర్జాతీయ ఫెడరేషన్ అమెరికన్ ఫుట్‌బాల్, భారత ఒలింపిక్ సంఘాల గుర్తింపు ఉంది.

# ఫ్యాన్ గాలికి ఎదురులేదు..

- వికసిత భారత్-2047 కాపీ కొట్టిన చంద్రబాబు
- నిరాశ, నిస్పృహలతో రగులుతున్న చంద్రబాబు
- వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి



**విశాలభారతి, ఏపీ బ్యూరో:** ఏడాది క్రితమే నీతి ఆయోగ్ 'వికసిత భారత్2047' ప్రణాళికను విడుదల చేసిందని దీనినే విజన్2047 అని పేరు మార్చి చంద్రబాబు కాపీ కొట్టారని, బాబు సొంత బ్రాండింగ్ ఏమీ కాదని రాజ్యసభ సభ్యులు, వైయస్సార్ సిపి జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి అన్నారు. పలు అంశాలపై ట్విట్టర్ లో ఆదివారం ఆయన స్పందించారు. 2047 నాటికల్లా అభివృద్ధి చెందిన దేశంగా భారత్ అగ్రస్థానంలో ఉంటుందని అందులో నీతి ఆయోగ్ పేర్కొందని చెప్పారు. దానినే బాబు కాపీ కొట్టి దేశానికి, రాష్ట్రానికి తాను దిశా నిర్దేశం చేస్తున్నట్టు బిల్డప్పులు ఇస్తున్నారని ఎద్దేవా చెశారు. ఆంధ్రాలో పెట్టుబడులు పెట్టొద్దంటూ హైద్రాబాద్ లో కూర్చొని ఏపీ విపక్షనేత చంద్రబాబు పిలుపునివ్వడం బట్టి...వారి నిరాశ, నిస్పృహలను అర్ధం చేసుకోవచ్చన్నారు. 2019లో ఎదురైన ఓటమి వల్ల పగతో వైయస్సార్ సిపిపై రగిలిపోతున్నారని చెప్పారు. 2024లో మళ్ళీ ఓడిస్తే అర్ధంలేని మాటలు మానేసి చంద్రబాబు మామూలు మనిషి అవుతారని తెలిపారు. ఏపీ లో ఎన్నిక ఏదైనా ఫ్యాన్ దే ప్రభంజనమని సర్పంచ్, ఉప సర్పంచ్ ఎన్నికల్లో 85 శాతానికి పైగా వైయస్సార్ సిపి కైవసం చెసుకుందని చెప్పారు. కుప్పంలో ఆరు వార్డు స్థానాలకుగాను ఐదు ఫ్యాన్ వశమయ్యాయని, 2024 ఎన్నికల్లో క్లీన్ స్వీప్ కు ఇదే సంకేతమని ఆయన చెప్పారు. ఫ్లడ్ వాచ్' మొబైల్ అప్లికేషన్ ప్రారంభించడం అభినందనీయం : వరదలను అంచనా వేసేందుకుగాను 'ఫ్లడ్ వాచ్' మొబైల్ అప్లికేషన్‌ను ప్రారంభించినందుకు సెంట్రల్ వాటర్ కమిషన్‌ను విజయసాయిరెడ్డి అభినందించారు. దీంతో వరద ముంపు ప్రాంతాల్లో నివసించే ప్రజలకు మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.. ప్రయాణీకులు, పర్యాటకులు కూడా దీనిని సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. ప్రజలకు రియల్ టైమ్ ప్రాతిపదికన ఏడు రోజుల పాటు వరద పరిస్థితి గురించి సమాచారం ఇవ్వడంతో పాటు సూచనలు కూడా చేస్తుండడమే ఈ యాప్ లక్ష్యమని ఆయన చెప్పారు.

## మెడికల్ స్టూడెంట్లకు హెల్ప్ లైన్ ప్రారంభం

**హైదరాబాద్, విశాల భారతి :** ఉజ్బెకిస్థాన్ ఆరోగ్య మంత్రిత్వశాఖ, తాష్కెంట్ మెడికల్ అకాడమీ (టీఎంఏ) కలిసి భారతీయ ఎంబీబీఎస్ విద్యార్థుల కోసం జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) ప్రమాణాల ప్రకారం 18001232931 అనే టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్, www.studyinuzbek.uz అనే ఒక వెబ్‌సైట్ ప్రారంభించాయి. హైదరాబాద్‌లోని టీఎంఏ దక్షిణాసియా ప్రతినిధి కార్యాలయం దేశంలోని ప్రధాన నగరాలన్నింటిలో సెమినార్లు కూడా నిర్వహిస్తోంది. కొంతమంది మోసపూరిత ఏజెంట్లు ఎంబీబీఎస్‌లో ప్రవేశాలు కల్పిస్తామని చెబుతూ, మధ్య తరగతికి చెందిన తల్లిదండ్రుల నుంచి పెద్ద మొత్తాల్లో డబ్బులు వసూలు చేస్తున్నారు. నిజానికి ఇది ఎన్ఎంసీ 2021లో విధించిన ఎఫ్ఎంజీఎల్ (ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్ లైసెన్సియేట్) రూల్స్‌కు విరుద్ధం. ఈ విషయం కేంద్ర ప్రభుత్వం దృష్టికి కూడా వెళ్లడంతో, ఎన్ఎంసీ తాజాగా కొత్త నిబంధనలు విధించింది. దాంతో విదేశీ యూనివర్సిటీలన్నీ తప్పనిసరిగా ఎన్ఎంసీ నిబంధనలకు కట్టుబడి ఉండాల్సి వచ్చింది. భారతదేశంలో ఇలాంటి నిబంధనలను అమలు చేయడంలో తొలిసారిగా ముందడుగు వేసిన ఉజ్బెకిస్థాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ, టీఎంఏ భారత ప్రతినిధి డాక్టర్ దివ్యరాజ్ రెడ్డి విద్యార్థులకు అధికారిక సమాచారం అందించేందుకు వీలుగా 18001232931 అనే టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్, www.studyinuzbek.uz అనే ఒక వెబ్‌సైట్ ప్రారంభించారు. వీటిద్వారా వైద్య విద్యార్థులు విదేశీ విద్య విషయంలో సమాచారాన్ని తనిఖీ చేసుకుని, తమ ప్రవేశాల విషయాన్ని ఎన్ఎంసీ ప్రమాణాల ప్రకారం ఖరారు చేసుకోవచ్చు. వీటిద్వారా ఉజ్బెకిస్థాన్ వైద్య విద్య భారతదేశానికి మరింత చేరువ అవుతోంది. భారత్, ఉజ్బెకిస్థాన్ రాయబారులు ఈ చర్యను ఎంతగానో ప్రశంసించారు. ఈ విషయమై టీఎంఏ వైస్ డీన్ డాక్టర్. ఖోల్మతొవ్ మాట్లాడుతూ, "మా స్ట్రాటజిక్ పార్ట్‌నర్ నియో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ భారతీయ పాఠ్యాంశాలు, పాఠ్యపుస్తకాలు, అధ్యాపకులు, నెక్స్ట్ మాస్టర్ క్లాసులను అందిస్తుంది. 250 మంది భారతీయ విద్యార్థులను టీఎంఏలో ఇంగ్లీషు మీడియంలో ఆరేళ్ల పాటు వైద్య విద్యను చదవడానికి వీలు కల్పిస్తుంది. ఇందులో 2000+ టీచింగ్ బెడ్ క్లినిక్‌లలో ఒక సంవత్సరం ఇంటర్న్‌షిప్ కూడా ఉంది. ఇవి ఎన్ఎంసీ నిబంధనల ప్రకారం టీఎంఏ ప్రామాణికీకరణకు సహాయపడ్డాయి" అని చెప్పారు. నియో చొరవతో, అందుబాటులోని ఫీజులు, భారతీయ ఆహారంతో సౌకర్యవంతమైన వసతి గృహాలు, అధిక స్కాలర్‌షిప్‌లతో సమయాన్ని కోల్పోకుండా వైద్య విద్యను కొనసాగించడానికి ఉక్రెయిన్ నుంచి తిరిగి వచ్చిన విద్యార్థులను టీఎంఏ అంగీకరించిందని డాక్టర్ ముకేష్, శ్రీ రోహిత్ ఎంఎస్ యూకే తెలిపారు.



# ఆలయాల రక్షణ అందరి బాధ్యత

## - బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి

**విశాలభారతి, హైదరాబాద్:**

ఆలయాల రక్షణ మన అందరి బాధ్యత అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం గోషామహల్ నియోజకవర్గం లోని కట్టల్ మండీ బస్తీలో ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ పునఃప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం లో ఆయన ఈటల రాజేందర్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. మూడు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా విఘ్నేశ్వర పూజతో ఈ రోజు ఈ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమైయ్యాయన్నారు. ఈ మహత్కార్యంలో నేను భాగస్వామ్యం అవ్వడం నా అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు.

# రియల్ ఎస్టేట్ సంస్థలా బీఆర్ఎస్ సర్కారు

మొదటిపేజీ తరువాయి

తెచ్చింది. తమ ప్రభుత్వం మళ్లీ వస్తదో రాదోనన్న భయంతో.. అధికారంలో ఉన్నప్పుడే ఇల్లు చక్కదిద్దుకునే ప్రయత్నం చేస్తోంది. రాష్ట్రంలోని ఎమ్మెల్యేలు, నాయకులు అక్రమాలకు పాల్పడుతున్నారు. నిర్మల్లో కూడా అలాంటి పరిస్థితే ఉన్నది. వీటిపై ప్రజలు చేస్తున్న ఉద్యమానికి మద్దతుగా, సంఘీభావంగా మా పార్టీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డిగారు నిరాహార దీక్ష చేస్తున్నారు. మా పార్టీ నాయకులు, శాసనసభ్యులు దీక్షకు మద్దతు తెలుపుతున్నారు. నిన్న నిరసన తెలుపుతున్న బీజేపీ పార్టీ నాయకులు, రైతులపై రాష్ట్ర ప్రభుత్వం అత్యంత దారుణంగా పోలీసులతో లాఠీచార్జ్ చేయించింది. దాదాపు 30 మంది యువకులు తీవ్రంగా గాయపడ్డారు. పలువురికి తలలు పగిలి గాయాలయ్యాయి. మాజీ మంత్రి, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు మహేశ్వర్ రెడ్డి గారి దీక్షకు మద్దతు తెలిపేందుకు వెళ్తుంటే.. పోలీసులు అడ్డుకున్నారు.' అంటూ కిషన్ రెడ్డి ఫైర్ అయ్యారు.

# చంద్రయాన్ 3 ల్యాండింగ్ టైమ్ ఫిక్స్

**విశాలభారతి, నేషనల్ బ్యూరో:**

చంద్రయాన్- 3 ల్యాండర్ కీలక ఘట్టానికి సిద్ధమవుతోంది. ఇప్పటికే ల్యాండర్ రెండో, చివరి డీ-బూస్టింగ్‌లను విజయవంతంగా పూర్తిచేసిన భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) జాబిల్లిపై అది దిగే సమయాన్ని వెల్లడించింది. ఆగస్టు 23న సాయంత్రం 6.04 సమయంలో చంద్రుడిపై 'విక్రమ్' ల్యాండర్ అడుగుమోపేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించింది. ఈ సాఫ్ట్ ల్యాండింగ్ ప్రక్రియను ఆయా వేదికల ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు తెలిపింది. బుధవారం సాయంత్రం 5.27 గంటల నుంచి ల్యాండింగ్ ప్రక్రియను ప్రత్యక్ష ప్రసారం చేస్తామని, ఇస్రో వెబ్‌సైట్, యూట్యూబ్ ఛానల్, ఫేస్‌బుక్ పేజీ, డీడీ నేషనల్ టీవీ ఛానల్ సహా ఆయా ప్లాట్‌ఫాంలపై అందుబాటులో ఉంటుందని ఇస్రో తెలిపింది. దేశవ్యాప్తంగా అన్ని విద్యాసంస్థల్లో ఈ ఈవెంట్ ప్రత్యక్ష ప్రసారానికి ఏర్పాట్లు చేయాలని ఈ సందర్భంగా ఇస్రో పిలుపునిచ్చింది. జాబిల్లిపై పరిశోధనలకు గానూ జూలై 14న 'చంద్రయాన్ -3'ని ప్రయోగించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం విక్రమ్ ల్యాండర్ మాడ్యుల్ చంద్రుడి నుంచి అత్యల్పంగా 25 కి.మీ, అత్యధికంగా 134 కి.మీ దూరంలో ఉన్న కక్ష్యలో పరిభ్రమిస్తోంది. ఇక చంద్రుడి దక్షిణ ధ్రువం ఉపరితలంపై దిగడమే తరువాయి. అంతా సజావుగా సాగితే ఆగస్టు 23న సాయంత్రం 6.04 సమయంలో చంద్రుడిపై ల్యాండర్ విజయవంతంగా అడుగు పెడుతుంది.



# బీసీలకు 50 శాతం టికెట్లు ఇవ్వాలి

మొదటిపేజీ తరువాయి

మాట్లాడుతూ ప్రస్తుతం వివిధ పార్టీలు లీక్ చేస్తున్న అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థుల పేర్లలో బీసీల పేర్లు చాలా తక్కువగా వస్తున్నాయన్నారు. డబ్బు , సర్వేల పేర్లతో, బీసీ నాయకులను పక్కన పెడుతున్నారని ఆరోపించారు. ప్రధాన పార్టీలు బీసీలకు టికెట్లు ఇస్తే ఎలా గెలిపించుకోవాలో తాము చూసుకుంటామన్నారు. ప్రతి పార్టీ 70 అసెంబ్లీ స్థానాలు బీసీలకు కేటాయించాలని, లేకపోతే బీసీలు తిరగబడతారని హెచ్చరించారు. 50 శాతం టికెట్లు ఇవ్వని పార్టీలను బీసీ సంఘాలు ఏకమై ఓడిస్తాయని హెచ్చరించారు. ప్రతి నియోజకవర్గంలో బీసీలు 50 శాతం కు పైగా ఉన్నారని, బీసీలకు ఇచ్చేది భిక్షం కాదు అన్నారు. ఏ సామాజిక వర్గం జనాభా ఎంత ఉంటే ఆయా సామాజిక వర్గాల జనాభా ప్రకారం టికెట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కులాలకు, సామాజిక వర్గాలకు వారి జనాభా ప్రకారం వాటా ఇస్తే సమైక్యత, సమగ్రత, శాంతి నెలకొంటుందన్నారు. ఇంతకాలం అన్ని రాజకీయ పార్టీలు బీసీలను ఓటు బ్యాంకుగా , జెండాలు మోయడానికి, జిందాబాద్ లు కొట్టించుకోవడానికి ఉపయోగించుకుంటున్నాయని మండిపడ్డారు. బీసీల అభివృద్ధికి ఏ పార్టీ చర్యలు తీసుకోవడం లేదన్నారు. దేశంలో బీసీలను బిచ్చగాళ్లను చేస్తున్నారన్నారు. స్వాతంత్రం వచ్చి 75 ఏండ్లు గడిచినా.. రాజకీయ రంగంలో బీసీల ప్రాతినిధ్యం 15 శాతం దాటలేదు అన్నారు. తెలంగాణలో 119 అసెంబ్లీ సీట్లకు బీసీలు 21 మంది మాత్రమే ఉన్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 18 జిల్లాల నుంచి ఒక్క బీసీ ఎమ్మెల్యే లేకపోవడం దుర్మార్గమన్నారు. బీసీ జాబితాలో 130 కులాలు ఉంటే 115 కులాలు ఇంతవరకు అసెంబ్లీ గేట్ దాటలేదన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ, యువజన సంఘం అధ్యక్షుడు నీలం వెంకటేశ్ , బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు అనంతయ్య, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల రామకృష్ణ, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు

**మిర్యాలగూడ , విశాల భారతి :** మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నూకల వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయం రాజీవ్ భవన్ లో కేక్ కట్ చేసి, రాజీవ్ చౌరస్తాలోని రాజీవ్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ, స్వర్గీయ రాజీవ్ గాంధీ గారు అతిపిన్న వయసులోనే ప్రధానమంత్రి పదవి బాధ్యతలు చేపట్టి, దేశాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకొచ్చిన మహా నాయకుడని ఆయన సేవలను కొనియాడారు. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం బిజెపికి తొత్తులుగా మారి, ప్రజలను మోసం చేయడంలో ముందంజలో ఉన్నారని, తెలంగాణలో ఎక్కడ ఏ భూములు ఉన్నాయో, వాటిని ఎంత త్వరగా అమ్మి డబ్బులు మూట కట్టుకోవాలని ఆలోచన తప్పతే ఈ రాష్ట్ర అభివృద్ధి మర్చిపోయారని, సంక్షేమ పథకాల పేరుతో ప్రజలను మాయ చేస్తూ ఈ నాయకులు పబ్బం గడుపుతున్నారని, వీరికి కూడా రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పి ఇంటికి పంపేది ఖాయమని అన్నారు. రాబోయే ఎలక్షన్లలో కాంగ్రెస్ పార్టీకి 100 సీట్లకు పైగా గెల్చుకుంటుందని వారన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పొదిల శ్రీనివాస్, తమ్మడపైన అర్జున్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు ముదిరెడ్డి నర్సిరెడ్డి, కౌన్సిలర్లు దేశిడి శేఖర్ రెడ్డి, గంధం రామకృష్ణ, వార్డ్ ఇంచార్జి లు రమేష్ నాయక్, బల్గురి శ్రీనివాస్, ముల్ల గిరి కాంతయ్య, ఉబ్బపల్లి, బంటు వీటి, మస్తాన్, లింగయ్య, నానక్ సింగ్, నాగరాజు, ఫాహిమ్, సతీష్ నాయుడు, కాంగ్రెస్ నాయకులు బిఎల్ఆర్ బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు.



## రాజీవ్ గాంధీ 79వ జయంతి వేడుకలు

**హైదరాబాద్,విశాలభారతి:** రాజీవ్ గాంధీ 79 వ జయంతిని పురస్కరించుకొని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నందికంటి శ్రీధర్ గౌతమ్ నగర్ డివిజన్ సత్యనారాయణ కేఫ్ లోని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో ఐటి రంగానికి పునాదులు వేసి దిశ నిర్దేశం చూపిన మార్గదర్శకుడు దివంగత ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో టి పిసిసి డెలిగేట్ జి డి శ్రీనివాస్ గౌడ్, డివిజన్ అధ్యక్షులు వైనాల ప్రవీణ్, లింగారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, గుత్తి రాంచందర్, గౌస్ బాయ్, మహమ్మద్ అలీ, ఎమ్మార్ శ్రీనివాస్ యాదవ్, రెబ్బ వాసు, యాదగిరి, నరేందర్ గౌడ్, రాజేష్ గౌడ్, నాగేష్ గౌడ్, ప్రకాష్, సత్యనారాయణ, కేశెట్టి రాములు, మాజిద్, ప్రభాకర్, మోహిన్,చరణ్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి

**దేవరుప్పుల విశాల భారతి :** మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ ఆఫీస్‌లో పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి పిలుపు మేరకు దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెద్ది కృషమూర్తి గౌడ్ ఆదేశాలతో మండల యూత్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 79వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేకును కోసి సంబురాలు జరుపుకున్నారు. అనంతరం సీతారాంపురం గ్రామంలోని అనాధ వృద్ధ శరణాలయంలో వృద్ధులకు మిఠాయిలు, పండ్లు పంచారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నారెడ్డి నరసింహారెడ్డి, మరాఠి స్వామి,ఉప్పుల అనిల్,అబ్బయ్య,పులి పంపుల సురేష్,మారేపల్లి మురళి,పుల్లయ్య,రాములు, పులి పంపుల నవీన్,తీగల. సురేష్ ,ఆకుల సంతు, తోటకురి సందీప్, ఉప్పుల ప్రకాష్ కొంగరి ఉమేష్, చింత నిఖిల్, చింత శ్రీకాంత్, జిలకర కిషన్, చింత ఉపేందర్, చింత ఉమేష్, చింత అఖిల్, చింటు పాల్గొన్నారు.



## ఉద్యమకారుల ఫోరమ్ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

**మిర్యాలగూడ విశాల భారతి :** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్యర్యంలో ఈనెల 27 న హైద్రరాబాద్ లోని ఇందిరాపార్క్ వద్ద జరగనున్న తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ రాష్ట సదస్సు పోస్టర్ ను ఆదివారం పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారులు ఫోరమ్ నాయకులు మారం శ్రీనివాస్, మాలోత్ దశరథ్ నాయక్ లు మాట్లాడుతూ, మలిదశ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యకారులకు పెన్షన్ ఇవ్వాలని, ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రత్యేక నిధి ఏర్పాటు చేయాలని కోరారు. ఉద్యమకారులకు సంక్షేమ పథకాల మంజూరు లో ప్రాదాన్యత, ఉద్యకారులకు ఉచిత వైద్యం కోసం హెల్త్ కార్డులు జారి చేయలని, ఉద్యమకారులకు నామినేటెడ్ పదవుల ఎంపికలో ప్రాదాన్యత ఇవ్వాలని, ఎన్నికల్లో పోటీకి ఉద్యకారులను ఎంపిక చేయలేని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యకారుల ఫోరమ్ నాయకులు రాపోల్ పరమేష్, కోటయ్య, వెంకటయ్య, చేగొండి మురళి యాదవ్, కొత్తపల్లి సైదులు, సోలమన్ రాజు,అశోక్ కుమార్, బంటు కవిత, లక్ష్మీ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.





# అన్ని వర్గాల అభివృద్దే సీఎం కేసీఆర్ లక్ష్యం

- జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి
- బొంతపల్లిలో వీరశైవ లింగాయత్ కళ్యాణమండపం ప్రారంభోత్సవం

**పటాన్ చెరు(గుమ్మడిదల)విశాలభారతి:** రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా సీఎం కేసీఆర్ పని చేస్తున్నారని జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గుమ్మడిదల మండల పరిధిలోని బొంతపల్లి శ్రీ భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి దేవాలయం సమీపంలో నూతనంగా నిర్మించిన వీరశైవ లింగాయత్ కళ్యాణ మండపాన్ని జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ తో కలిసి ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రసిద్ధి చెందిన వీరభద్ర స్వామి దేవాలయాన్ని అన్ని వసతులతో అభివృద్ధి పరుస్తున్నామని తెలిపారు. పెరుగుతున్న భక్తుల సంఖ్యకు అనుగుణంగా వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులోనూ ఆలయ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రవీణ విజయభాస్కర్ రెడ్డి, జెడ్పిటిసి కుమార్ గౌడ్, సీనియర్ నాయకులు గోవర్ధన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ భద్రప్ప, స్థానిక ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, వీరశైవ లింగాయత్ సమాజం ప్రతినిధులు పాల్గొన్నారు.



## సెప్టెంబర్ 3న ఐదు గుళ్ల పోచమ్మ తల్లి బోనాలు

**- రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప నగేష్**

**పటాన్ చెరువిశాలభారతి :** రామచంద్రాపురం పట్టణంలోని శ్రీనివాస్ నగర్ కాలనీ ఐదుగుళ్ల పోచమ్మ తల్లి శ్రావణ మాస బోనాలను సెప్టెంబర్ 3వ తేదీన నిర్వహించేందుకు నిర్ణయించినట్లు కార్పొరేటర్ బూరుగడ్డ పుష్ప నగేష్ తెలిపారు. రామచంద్రపురం పురప్రముఖులు, గ్రామస్థులు, కుల సంఘాల పెద్దలు, నాయకులతో కలిసి శ్రీనివాస్ నగర్ కాలనీ ఐదుగుళ్ల పోచమ్మ దేవాలయ ఆవరణంలో దేవాలయ కమిటీ అధ్యక్షులు కరికే సత్యనారాయణ అధ్వర్యంలో ఏర్పటు చేసిన సమావేశంలో కార్పొరేటర్ పుష్ప నగేష్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. బోనాల పండుగ గురించి అందరితో చర్చించి సెప్టెంబర్ 3న శ్రావణమాస బోనాల పండుగ తేదీని ఖరారు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ జిహెచ్ఎంసి ద్వారా అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. శానిటేషన్, ఎలక్ట్రికల్ లైటింగ్, ఎంటమాలజి స్ప్రయింగ్ తదితర పనులను చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, నిరంజన్ రెడ్డి, ఎల్వర్తి మల్లేష్, ఆలూరి గోవింద్, గోపాల కృష్ణ, జ్ఞానేశ్వర్ గౌడ్, మవీన్ గౌడ్, తొంట నర్సింహా, బైకాన్ సాయిలు, ఊరెళ్ళ రాజు, మహేందర్ రెడ్డి, జనముల బాలరాజు, అశోక్ ముదిరాజ్, రాగం రాంచందర్, కరికే యాదయ్య, కుమ్మరి విట్టల్, కుమార్, కరికే దాస్, బేకు యాదయ్య, బల్ల నర్సింగ్, దప్పు యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా కోలన్ బాల్ రెడ్డి జన్మదిన వేడుకలు

- ప్రజాసేవకే నా జీవితం అంకితం
- మాజీ జెడ్పిటిసి కోలన్ బాల్ రెడ్డి

**బొల్లారం మున్సిపాలిటీ, విశాల భారతి:** నా ప్రాణం ఉన్నంతవరకు ప్రజా సేవకే అంకితమని మాజీ జెడ్పిటిసి కోలన్ బాల్ రెడ్డి అన్నారు. ఆదివారం నాడు ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని శ్రేయోభిలాషులు, కౌన్సిలర్లు, అభిమానులు, పార్టీ కార్యకర్తలు మాట్లాడుతూ సుమారు 25 సంవత్సరాలుగా అలుపెరగని, ఓటమి తెలియని నాయకుడు కులం బాల్ రెడ్డి అని అన్నారు. అహర్నిశలు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న బాల్ రెడ్డి మరిన్ని పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఆదివారం జన్మదిన కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. భారీ ర్యాలీ నిర్వహించి, పార్టీ కార్యకర్తలు అభిమానులు నాయకులు బాల్ రెడ్డిని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# మోడీ కనుసన్నల్లోనే సూర్జిత్ భవనంపై దాడి

**సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతరాములు**



**సూర్యాపేట, విశాల భారతి:** ప్రగతిశీల శక్తులకు భయపడిన మోడీ సర్కార్ ఢిల్లీలోని సూర్జిత్ భవన్ పై దాడి చేశారని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ శాసనమండలి సభ్యులు చెరుపల్లి సీతారాములు ఆరోపించారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఢిల్లీలోని హరికిషన్ సుజిత్ భవన్ లో జి20 సమావేశాల సందర్భంగా కవులు, కళాకారులు, మేధావులు ఈనెల 18,19 తేదీలలో సమావేశాలు నిర్వహించుకుంటుంటే పోలీసులు ఆ సమావేశాన్ని అడ్డుకోవడం సబబు కాదన్నారు. ఆల్ మీటింగ్ కు పర్మిషన్ లేదని ఈ మీటింగ్ ను రద్దు చేసుకోవాలని చెప్పడం బిజెపి కుట్రలో భాగమేనని అన్నారు. ఈ సంఘటన బిజెపి నియంత్రత్వ పోకడకు నిదర్శనం అన్నారు. మోడీ భయంతోనే ఈ సమావేశాన్ని అడ్డుకున్నారని అన్నారు. జీ 20 సమావేశాలలో చర్చించాల్సిన అంశాలైన ధరలు ,నిరుద్యోగం, ప్రగతిశీల భావాల పట్ల జరుగుతున్న దాడులు, పర్యావరణం మొత్తం ప్రపంచంలో ఉన్న పేదల కోసం చర్చిస్తున్న ఈ సమావేశాన్ని నిలుపుదల చేయడంలో అర్థం లేదన్నారు. సెప్టెంబర్ 1 నుండి 7 వరకు దేశవ్యాప్తంగా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న అధిక ధరలు, నిరుద్యోగ సమస్యల పై వారం రోజులపాటు నిరసన కార్యక్రమాలను నిర్వహించాలని కేంద్ర కమిటీ నిర్ణయించిందన్నారు. దేశంలో రోజురోజుకు పేదల సంఖ్య, దరిద్రం పెరుగుతుందన్నారు. గతంలో దేశంలో 124 మంది కోటీశ్వరులు ఉంటే ప్రస్తుతం 145కు సంఖ్య పెరుగుతుందన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం ఈ తొమ్మిది సంవత్సరాల కాలంలో కోటి ఉద్యోగాలు ఇచ్చిన పాపాన పోలేదన్నారు. అన్ని రకాల నిత్యవసర వస్తువుల ధరలు పెరగడం మూలంగా రైతులు, వ్యవసాయ కార్మికులు,వృత్తిదారులపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అధిక ధరల వ్యతిరేకంగా కలిసిచ్చే శక్తులతో కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సెప్టెంబర్ 10 నుండి 17 వరకు వార్షికోత్సవ సభలను అన్ని పోరాట కేంద్రాల్లో నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.వి రమణ, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు,మట్టి పెల్లి సైదులు,సిపిఎం పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు గౌడ్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బెల్లంకొండ వెంకటేశ్వర్లు, ఎల్గూరి గోవింద్,నరసింహారావు, వెంకన్న, సైదమ్మ, రవి, శేఖర్, నరసయ్య, బిక్షం, అంజిబాబు,మామిడి సుందరయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఆపదలో అండగా సీఎం సహాయనిధి

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**
**- రూ 2 లక్షల 50 వేల విలువైన ఎల్ఓసి చెక్కుల పంపిణీ**

**పటాన్ చెరువిశాలభారతి :** తెలంగాణ ప్రభుత్వం నిరుపేదలను ఆపద సమయంలో సీఎం సహాయ నిధి ద్వారా అండగా నిలిచి ఆదుకుంటుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్ చెరు మండలం భానూరు గ్రామానికి చెందిన సఫియ ఖతూన్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతొంది. మెరుగైన వైద్య చికిత్స కోసం ఎమ్మెల్యే జిఎంఆర్ ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు సఫియ వైద్యానికి రెండు లక్షల 50 వేల రూపాయలు మంజూరయ్యాయి. ఈ మేరకు క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సఫియా కుటుంబ సభ్యులకి ఎల్ఓసి పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ అంజయ్య, సీనియర్ నాయకులు మాణిక్ రెడ్డి, అఫ్జల్, మెరాజ్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

## గడప గడపకు రఘు సేవలు



**ఆపదలో ఉన్న పేదలకు చేయూత**
**వెంకన్న గౌడ్ కుటుంబానికి ఆర్థిక సాయం**

**పాలకీడు, విశాల భారతి :** మండలంలోని యల్లాపురం గ్రామంలోని వివిధ కాలనీలకు చెందిన నిరుపేద కుటుంబాలకు పిల్లుట్ల రఘు చేయూత నిచ్చారు. గ్రామానికి చెందిన పోలగోని వెంకన్న గౌడ్ అనారోగ్యంతో ఇటీవల చనిపోయాడు. ఆయన కుటుంబానికి రఘు రూ. 5000 అందించారు. ఈ సందర్భంగా ఓజో పౌండేషన్ నియోజకవర్గ ఇన్‌చార్జి కుక్కల వెంకన్న మాట్లాడుతూ పిల్లుట్ల రఘు ఓజో ఫౌండేషన్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేస్తూ, సామాన్య ప్రజలను ఆదుకుంటున్నారన్నారు. విద్య, వైద్యం పరంగా ఆదుకుంటూ హుజూర్ నగర్ నియోజకవర్గంలోనే అందరికీ అండగా నిలుస్తున్నారన్నారు. సాధారణ మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చిన రఘు నియోజకవర్గం అభివృద్దే ధ్యేయంగా, కుల,మత భేదం లేకుండా అన్ని వర్గాల వారిని ఆదుకుంటూ ముందుకెళ్తున్నారన్నారు. పేదల బతుకులు వెలుగులు నింపేందుకే రఘు రాజకీయరంగ ప్రవేశం చేశారన్నారు. అందుకే వచ్చే ఎన్నికల్లో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఓజో ఫౌండేషన్ పాలకీడు మండలం నాయకులు గంగరాజు యాదవ్, మన్నెం వేణు యాదవ్,షేక్ జాన్ సైదా,కానుగు అనిల్ గౌడ్, నాగరాజు యాదవ్ ,బొమ్మకంటి సైదులు ముదిరాజ్,వంశీ,అజయ్, వినయ్, నాగార్జున,రవి నాయక్ , సైదా, తదితరులు పాల్గొన్నారు.



## కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

**చిట్యాల, విశాల భారతి :** తెలంగాణ విద్యాశాఖలో భాగమైన సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులకు మినిమమ్ టైం స్కేల్ ఇచ్చి, వెంటనే రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బోయ శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సమగ్ర శి క్షా అభియాన్‌లో 22వేల మంది పనిచేస్తున్నారన్నారు. 19 ఏండ్లుగా పనిచేస్తూ చాలీచాలని జీతాలతో దుర్భర జీవితం గడుపుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షల ద్వారా మెరిట్, రోస్టర్ విధానం ద్వారా రిక్రూట్ అయ్యామని సీఎం కేసీఆర్ కాంట్రాక్ట వ్యవస్థ ఉండదు అన్నారని, దాన్ని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

## విద్యుత్ షాక్ తో యువకుడు మృతి

**బాల్కొండ, విశాలభారతి :** విద్యుత్ షాక్ తగిలి యువకుడు మృతిచెందిన సంఘటన నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండలంలో చోటు చేసుకుంది. బాల్కొండ ఎస్సై గోపి తెలిపిన వివరాల ప్రకారం బాల్కొండ మండలం చిట్టాపూర్ గ్రామ శివారులో బాల్కొండ మండల కేంద్రానికి చెందిన ముషాసిల్ (19) మాధవ సిమెంట్ పైపుల ఫ్యాక్టరీలో సిమెంట్ పైపును ఆటో ట్రాలీలో లోడ్ చేస్తుండగా మాధవ సిమెంట్ ఫ్యాక్టరీకి చెందిన క్రేన్ డ్రైవర్ నిర్లక్ష్యం మూలంగా విద్యుత్ షాక్ తగిలి మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపి వెల్లడించారు. మాధవ సిమెంట్ పైపుల కంపెనీకి చెందిన క్రేన్ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లనే ముషాసిల్ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.




# సలాం.... కరీమ్

- పేద పిల్లల కోసం మదర్సా నిర్వహణ
- ఉచిత విద్యతో పాటు మధ్యాహ్న భోజనం
- 70 మందికి తెలుగు, ఉర్దూ, అరబ్బీ భాషల్లో శిక్షణ
- అందరికి ఆదర్శం అన్వరే ముస్తఫా మదర్సా

**అమనగల్లు, విశాలభారతి:** మదర్సా ఏర్పాటు చేసి నిరుపేద చిన్నారులకు ఉచితంగా విద్యతో పాటు భోజనం అందిస్తూ ఆదర్శంగా నిలిచాడు. అన్వరే ముస్తఫా మదర్సా నిర్వాహకుడు మౌలానా అబ్దుల్ కరీం... కార్పొరేట్ చదువుల పేరుతో విద్యను, వ్యాపారంగా మార్చి నిలువు దోపిడికి గురి చేస్తూ విద్య విద్యాలయాలు అంటేనే హడాలిపోయే నేటి సమాజంలో తాను ఉన్నత విద్యను అభ్యసించి తనకున్న విద్య పరిజ్ఞానంతో పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తు అందరికి ఆదర్శంగా నిలుస్తున్నాడు.. మౌలానా అబ్దుల్ కరీం మదర్సా ఏర్పాటు చేసి దాతల సహకారంతో విజయవంతంగా నిర్వహిస్తున్నాడు.. ప్రభుత్వ పరంగా మదర్సా నిర్వహణకు సహకారం అందిస్తే మరింత మంది పిల్లలకు విద్యను అందిస్తామని మౌలానా అబ్దుల్ కరీం అంటున్నాడు....

***అద్దె భవనంలో 5 మందితో మొదలై***

తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలో మధ్య తరగతి కుటుంబం పుట్టిన మౌలానా అబ్దుల్ కరీం 2013 జూన్ లో అమనగల్ పట్టణంలోని అద్దె భవనంలో అన్వరే ముస్తఫా మదర్సా ను ప్రారంభించారు.. మదర్సా ను ప్రారంభించిన సమయంలో కేవలం 5 మంది పిల్లలతో ప్రారంభించగా నేడు 70 మంది విద్యార్థులు ఉన్నారు. 1 నుంచి 7 తరగతులు మదర్సా లో నిర్వహిస్తూ ఉర్దూ ,తెలుగు, అరబ్బీ భాషలలో విద్యాబోధన అందిస్తున్నాడు.. ప్రభుత్వం ప్రోత్సాహం లేకున్నా దాతల సహకారంతో ఉచితంగా విద్యను అందించడమే కాక భోజనం కూడా అందిస్తున్నాడు... రోజు విద్యార్థులకు ఖురాన్ పై ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాడు.

*మదర్సా నిర్వాహకుడు అబ్దుల్ కరీం మాట్లాడుతూ* ఉర్దూలో అలిమ్ అనే ఉన్నత విద్యను చదివిన తాను పట్టణంలో అన్వరే ముస్తఫా మదర్సా నిర్వహణకు ఆర్థిక ఇబ్బందులు ఉన్న కొనసాగిస్తున్నాను.. చదువుకు దూరమవుతున్న పేద చిన్నారులను చేరదీయడమే లక్ష్యం... దాతల సహకారంతో పుస్తకాలు, యూనిఫారాలు అందిస్తున్నాను.. కొంచెం భారంగా ఉన్న చిన్నారులకు మధ్యాహ్న భోజనం పెడుతున్నాను. పాఠశాలకు నిర్వహణకు నెలకు 20 నుంచి 30 వేల రూపాయల ఖర్చు వస్తుందని,,, ఎక్కడైనా వారాంలో ఒకరోజు పనిచేసిన డబ్బులు సంపాదించవచ్చునని ,పేద పిల్లలకు సేవ చేయడంలో ఉన్న తృప్తి అందులో లేదన్నారు.. ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తే మరింత మంది పేద పిల్లలకు విద్యను అందిస్తూ సేవ చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని ఆయన చెప్పారు








## ముజీబ్ హుస్సేనీ కు ఘన సన్మానం

**హైదరాబాద్, విశాల భారతి:** టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్‌హుస్సేనీ 'భారత్ కే అన్మోల్' పురస్కారం అందుకున్నారు. తాను చేసిన సేవలకుగాను హుస్సేనీకి న్యూఢిల్లీకి చెందిన ది న్యూస్ యులైక్ ఆంగ్ల మ్యాగజైన్ ఈ పురస్కారాన్ని ప్రకటించింది. జూలై 31న న్యూఢిల్లీలో ఈ అవార్డులను అందుకోవాల్సి ఉండగా, అనివార్య కారణాల వల్ల హుస్సేనీ ఢిల్లీకి వెళ్లలేకపోయారు. ముఖ్యమంత్రి ప్రత్యేక సలహాదారు ఏకే ఖాన్ చేతుల మీదుగా భారత్ కే అన్మోల్ పురస్కారాన్ని హుస్సేనీ అందుకున్నారు. ఈ సందర్భంగా టీఎన్జీవోస్ హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గృహకల్ప ఆఫీస్‌లో ఘనంగా సన్మానించారు. టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మామిండ్ల రాజేందర్, ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్, సహ అధ్యక్షుడు మహ్మద్ నజీర్ , ప్రచార కార్యదర్శి శైలజ , హైదరాబాద్ కార్యదర్శి విక్రమ్ కుమార్, కార్యవర్గ సభ్యుల ముజీబ్‌ను శాలువాలు, పూల మాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ముజీబ్ మీడియాతో మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశీర్వాదం, కుటుంబసభ్యుల ప్రోత్సాహం, ఉద్యోగుల సహాయ సహకారాలతో సమాజంలో పేదలకు సేవచేసే అవకాశం లభించదని తెలిపారు. ట్రెజరర్ జె. బాలరాజు, అసోసియేట్ ప్రెసిడెంట్ కే.ఆర్.రాజ్ కుమార్, సభ్యులు ఉమర్ ఖాన్, కే.శ్రీనివాస్, మొహమ్మద్ అబ్దుల్ ముజీబ్, నరేష్ కుమార్, వైద్యక్ శాస్త్ర, ఖాలీద్ అహ్మద్, బొల్లిగిద్ద శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## యడ్యూరప్ప కుమారుడితో సంగప్ప భేటీ

**విశాలభారతి జడ్చర్ల:** ఎమ్మెల్యే ప్రవాస యోజన లో భాగంగా తెలంగాణకు విచ్చేసిన కర్ణాటక ఎమ్మెల్యే బీఎస్ విజయేంద్ర ను మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల లో బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి జెనవాడే సంగప్ప శాలువాతో సత్కరించారు. విజయేంద్ర గారు కర్ణాటక మాజీ ముఖ్య మంత్రి బీఎస్ యడ్యూరప్ప గారి కుమారుడు. తెలంగాణలో బిజెపి గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని విజయేంద్ర చెప్పినట్లు సంగప్ప పేర్కొన్నారు.



## అక్రమ అరెస్టులను ఖండించండి

**నూతనకల్, విశాల భారతి:** సీఎం కేసీఆర్ సూర్యాపేట పర్యటన సందర్భంగా పీవైఎల్ నాయకుడు మున్న అశోక్ ను ముందస్తుగా అరెస్టు చేయడాన్ని పీవైఎల్ లీడర్ దేశోజు మధు ఖండించారు. ప్రశ్నించే గొంతుకలను ముందస్తు అరెస్టులు చేయడం అప్రజాస్వామికమని, మేధావి వర్గం, ప్రజలు వ్యతిరేకించాలని ఆయన కోరారు.

## పాలకుర్తిలో రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు



**పాలకుర్తి, విశాల భారతి :** భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు పాలకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. పాలకుర్తి మండల కేంద్రంలో గల రాజీవ్ చౌరస్తాలో రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం మండల పార్టీ అధ్యక్షుడు గిరగాని కుమార స్వామి గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ మాట్లాడుతూ దేశంలో సాంకేతిక విప్లవానికి నాంది పలికింది రాజీవ్ గాంధీయే అన్నారు. అంతే కాకుండా అభివృద్ధి చెందుతున్న దేశాల సరసన భారతదేశాన్ని నిలిపిన ఘనత కూడా ఆయనకే దక్కుతుందన్నారు. దేశంలోని పేదరికాన్ని పారద్రోలి సమసమాజ స్థాపనకు రాజీవ్ గాంధీ చేసిన కృషి ఎప్పటికి మరువలేమని కొనియాడారు.

అంతే కాకుండా భారతదేశానికి ఒక దిక్సూచిగా గాంధీ కుటుంబ సభ్యులు నిలిచారని తెలిపారు. దేశ సమైక్యత కోసం ప్రపంచ దేశాల్లో భారత్ అగ్రస్థానంలో నిలపడానికి ఇందిరాగాంధీ రాజీవ్ గాంధీ కృషి చేశారని అన్నారు. దేశ సంక్షేమం కోసం, అభివృద్ధికోసం ఆఖరి రక్తపు బొట్టు వరకు దేశం కోసం ప్రాణాలు అర్పించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సాంస్కృతిక సేనా అధ్యక్షుడు చక్రాల రఘు జిల్లా ఉపాధ్యక్షుడు అనుముల మల్లారెడ్డి జిల్లా కార్యదర్శి కారుపోతుల శ్రీనివాస్ జిల్లా సేవాదళ్ ఆర్గనైజర్ గుగ్గిళ్ల ఆదినారాయణ ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు లావుడ్యా భాస్కర్ నాయక్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు గాదెపాక భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు

**బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీ లో చేరిక**

**నారాయణఖేడ్, విశాలభారతి:** కల్హేర్ మండలం బిబిపేట గ్రామ బిఆర్ఎస్ కార్యకర్తలు మరియు గ్రామ పెద్దలు టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ పట్లోల సంజీవ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరిక బిబిపేట గ్రామస్తులు చేరిన వారిలో వై దేవి రెడ్డి. వై నర్సారెడ్డి. వై వెంకట్ రెడ్డి. వై హనుమంత్ రెడ్డి. వై సంతోష్ రెడ్డి. గుండు దేవేందర్ రెడ్డి. వై సంజీవరెడ్డి . సాయిలు. విట్టల్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరినారు. ఈ కార్యక్రమంలో వినోద్ పటేల్ యూత్ కాంగ్రెస్ పార్లమెంట్ మాజీ అధ్యక్షులు. ఎస్టీ సెల్ కిషన్ నాయక్. ఎస్సీ సెల్ అధ్యక్షులు శ్రీకాంత్ . కృష్ణ అర్జున్ మాజీ ఎంపీటీసీ.. ఏసన్న . తదితరులు ఉన్నారు



## పూరి గుడిసెలో ఉంటే 'గృహలక్ష్మి' ఇవ్వరా?

**మిర్యాలగూడ, విశాల భారతి :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 'గృహలక్ష్మి' పథకం రాజకీయ జోక్యం వల్ల పేదలకు అందని ద్రాక్షగా మారిందని సలుకునూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారాబోయిన సతీష్ ఆరోపించారు. నియోజకవర్గ పరిధిలోని వేములపల్లి మండల పరిధిలోని సలుకునూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తొమ్మిదేండ్ల తర్వాత తెలంగాణ ప్రభుత్వం గృహలక్ష్మి పేరుతో ఇల్లు మంజూరుకు అప్లికేషన్లు ఆహ్వానించిందని, కానీ మండల అధికారులు సర్వే చేసి, పూరిగుడిసెలో ఉన్న వారికి ఇండ్లు మంజూరు చేయడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పార్టీలతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికి ఇండ్లు మంజూరు చేయడం ద్వారా అనేకమంది లబ్ధి పొందారన్నారు. కానీ ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లలో అనేకమంది అర్హులు జాబితాలో లేకపోవడం శోచనీయమన్నారు. వెంటనే అధికారులు రీ సర్వే చేసి అర్హులైన వారికి ఇండ్లు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జానిరెడ్డి, ట్రెజరర్ కందుకూరి వీటి, బి, సురేశ్ , అంకెపాక శ్రీనివాస్, అంకెపాక సైదులు, తమ్మడబోయిన రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రసాద్ కుటుంబానికి ఆర్థిక సాయం

**చిట్యాల, విశాల భారతి :** ఇటీవల రోడ్డు ప్రమాదంలో చనిపోయిన చిట్యాల మండలం చిన్న కాపర్తి గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ కొండ ప్రసాద్ గౌడ్ కుటుంబ సభ్యులకు లారీ అసోసియేషన్ సభ్యులు ఆర్థికసాయం అందించారు. ఆదివారం నిర్వహించిన ప్రసాద్ సంతాపసభలో హరిహర అంబికా ఆంజనేయ లారీ డ్రైవర్స్ యూనియన్ సభ్యులు హాజరై ఆయన ఫొటోకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం యూనియన్ తరపున సేకరించిన 50వేల రూపాయలనీ కుటుంబ సభ్యులకి అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు కొత్త వెంకటేశం గౌడ్, ఉపాధ్యక్షుడు మెట్టు నరసింహ, కార్యదర్శి గురిజ సుధాకర్, కోశాధికారి వీరమల్ల రాములు, సలహాదారుడు పాకాల నరసింహ, కార్యవర్గ సభ్యులు కొత్త భాస్కర్ గౌడ్, మామిడి అశోక్ గౌడ్, ఆవుల సత్తయ్య, కొత్త మల్లేష్, పల్లపు వెంకన్న, చిట్టిపోలు శివ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణలో భాజపా జెండా ఎగరవేస్తాం

**అస్సాం ఎమ్మెల్యే తరంగ గోగోయ్**

**ధర్పల్లి, విశాలభారతి:** ధర్పల్లి మండల కేంద్రంలో ఆదివారం నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన అస్సాం ఎమ్మెల్యే తరంగ గోగోయ్ కు భాజపా కార్యకర్తలు బైక్ ర్యాలీతో ఘనంగా ఆహ్వానించారు.


ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ ఎంతో బలపడిందని రానున్న రోజుల్లో తెలంగాణలో బీజేపీ జెండా ఎగురవేస్తామని, అలాగే బూత్ స్థాయి కమిటీలు, శక్తి కేంద్రాలు, మండల స్థాయి కమిటీలు, జిల్లా స్థాయి కమిటీలు కలిపి పార్టీ బలోపేతనికి అందరూ కలసి కట్టుగా కృషి చేయాలని, ఎన్నికల దగ్గర పడుతుంది కాబట్టి ఎన్నికల కార్యాచరణ చేపట్టి కష్టపడి పని చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ రూరల్ నియోజికవర్గం ఇంఛార్జి దినేష్ కులచారి, ధర్పల్లి భాజపా మండల అధ్యక్షుడు లోలం గంగారెడ్డి, మహిపాల్ యాదవ్, రాజేందర్ గౌడ్, చేలిమెల నవీన్, కర్క గంగా రెడ్డి, బాల్ రెడ్డి, సదానంద గౌడ్, నరేష్ గౌడ్, వివిధ మండల కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 'తుర్కయంజాల్‌ను మండలంగా ప్రకటించాలి'



**తుర్కయంజాల్, విశాలభారతి:** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని తుర్కయంజాల్‌ను మండల కేంద్రంగా ప్రకటించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఏనుగంటి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. పరిపాలనా సౌలభ్యం, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. తుర్కయంజాల్‌తో పాటు పరిసర గ్రామాల్లోని ప్రజలు అబ్దుల్లాపూర్‌మెట్ వెళ్లాలంటే ప్రయాణ ప్రయాస ఎక్కువైందన్నారు. అత్యవసర పనుల నిమిత్తం అబ్దుల్లాపూర్‌మెట్ వెళ్లాలంటే సరైన బస్సు సౌకర్యం లేదన్నారు. ఎల్బీనగర్ వెళ్లి అక్కడ నుంచి మెట్టుకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. తుర్కయంజాల్ ప్రజల అభ్యర్థనను మన్నించి ప్రభుత్వం వెంటనే మండల కేంద్రంగా ప్రకటించాలన్నారు. దీంతో సాగర్ రహదారి మరింత అభివృద్ధి చెందే అవకాశాలు కూడా ఉన్నాయని శ్రీకాంత్ తెలిపారు.

## డీసీసీ ప్రెసిడెంట్ సంజీవ్‌రెడ్డికి సన్మానం



**యాదాద్రి భువనగిరి, విశాల భారతి :** ఇటీవల కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన అండెం సంజీవ్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు జిట్టా మల్లారెడ్డి గారి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ టికెట్ ఎవరికి ఇచ్చినా పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్ట పడి గెలుపు కోసం పని చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పంజలా రామాంజనేయులు గౌడ్, పీసీసీ ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్ కుమార్, బర్రె జహంగీర్, ఎలిమినేటి కృష్ణా రెడ్డి, మజార్ , గోదా రాహుల్ గౌడ్, గోదా శ్రీనివాస్ ,రఫీ, కల్యా నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్రంలో ప్రతి పల్లె అభివృద్ధి

**ప్రభుత్వ విప్ రేగ కాంతారావు**

**కరకగూడెం, విశాల భారతి :** కరకగూడెం మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ విప్ రేగా కాంతారావు బీటీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఆర్ అండ్ బి రోడ్డు తాటిగూడెం నుంచి గాంధీనగర్ వరకు రూ. 1 కోటి అంచనా వ్యయంతో నిర్మించనున్న రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. వెంకటాపురం గ్రామపంచాయతీలో పరిధిలోని పాపాయిగూడెం గ్రామంలో సుమారు రూ. 3 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న 2 బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. పోలకమ్మతోగు నుండి దోమేడ వరకు సుమారు రూ. 1 కోటి అంచనా వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కరకగూడెం నుండి మెట్ల గూడెం వరకు సుమారు 2 కోట్ల 25 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ రేగా కాంతారావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి పల్లె అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుంది అన్నారు, తెలంగాణ రాష్ట్ర ఏర్పడ్డాక సీఎం కేసీఆర్ నేతృత్వంలో అన్ని వర్గాల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. నియోజవర్గంలోని గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నానని ఆయన ప్రణాళికబద్ధంగా సిసి రోడ్లు రహదారులు మంజూరు చేసి వాటిని పూర్తి చేస్తున్నామన్నారు.

## ఘనంగా సత్యనారాయణ బర్త్‌డే



**నకిరేకల్, విశాల భారతి :** తెలంగాణ రాష్ట్ర సాధనలో క్రియాశీలక పాత్ర పోషించిన ఉద్యమకారుడు బీఆర్ఎస్వీ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు చిర్రబోయిన సత్యనారాయణ బర్త్‌డే వేడుకలు నకిరేకల్ పట్టణంలో స్నేహితుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచుకున్నారు. తెలంగాణ ఉద్యమంలో సత్యనారాయణ పోషించిన పాత్రను మిత్రులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు చెరుకు సతీష్, గాదె శివ, ఏపూరి అనిల్ కుమార్, గుండు సురేశ్ , పగిళ్ల కృష్ణ, విజయ్, నాగయ్య, గోవర్ధన్, దశరథ రామ్మూర్తి యాదయ్య ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.



## సూర్యాపేట సభకు కదిలిన గులాబీ దండు

**నూతనకల్, విశాల భారతి :** సూర్యాపేటలో జరిగే ప్రగతి నివేదన సభకు నూతనకల్ మండల పరిధిలోని చిల్పకుంట్ల ,లింగంపల్లి ,ఎర్రపాడు ,బక్క హేమల తండా ,ఎడవెల్లి ,తాళ్ల సింగారం వివిధ గ్రామాల నుంచి భారీ సంఖ్యలో బీఆర్ఎస్ కార్యకర్తలు తరలి వెళ్లారు.



# వడ్యాట్ లో కాంగ్రెస్ జెండా ఆవిష్కరణ

- పార్టీ కార్యాలయం ప్రారంభం
- పాల్గొన్న ముత్యాల సునీల్ కూమార్ రెడ్డి

**బాల్కొండ,విశాలభారతి:** బాల్కొండ నియోజకవర్గం మోర్తాడ్ మండలం వడ్యాట్ గ్రామంలో కాంగ్రెస్ నాయకుడు ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం నూతన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వివిధ పార్టీల నుండి బాజన్న గారి చిన్న గంగాధర్, నక్క నర్సింలు,ఎన్నడ్ల రవికాంత్,ఆర్మూర్ శ్రీనివాస్,సుదబోయిన శ్రీనివాస్ గౌడ్,ఏలేటి రాములు,ముస్కు మురళి, రవికాంత్,గంగాధర్, సాగర్,లింగమయ్య,రాజు,మరి కొందరు సునీల్ కూమార్ సమీక్షంలో కాంగ్రెస్ పార్టిలో చేరారు.ఈ సందర్భంగా సునీల్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రాబోతుందని,నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరబోతుందని అన్నారు.అన్ని వర్గాల సంక్షేమం చూసే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టి అధ్యక్షుడు ముత్యాల రాములు, సల్మాన్,అశోక్, రవి,నవీన్,ఎర్రన్న,మహిపాల్ కాంగ్రెస్ పార్టి నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.



# తారప్రసాద్ సేవలు భేష్

**మణుగూరు, విశాల భారతి :** అన్నం సేవా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు అన్నం శ్రీనివాస్ రావు ఆదివారం అమ్మ నాన్న వృద్ధాశ్రమం ను సందర్శించారు. నేను సైతం సోషల్ రెస్పాన్సిబిలిటీ ఆర్గనైజేషన్ ఆద్వర్యంలో నెలకొల్పిన వృద్ధాశ్రమం ను విజిట్ చేసి నిర్వాహకులు తార ప్రసాద్ కుటుంబ సభ్యులు చేస్తున్న సేవలు గొప్పవని ప్రశంసించారు. తారప్రసాద్ వృద్ధుల పట్ల చూపుతున్న ప్రేమ అభిమానాలు స్వయంగా చూసి, వృద్ధుల మాటల్లో తెలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు జీవీ, వృద్ధులు పాల్గొన్నారు.



# సీతాఫల్ మండి లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

**సికింద్రాబాద్,విశాలభారతి:** సికింద్రాబాద్ నియోజకవర్గం లోని సీతాఫల్మండి డివిజన్ లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నోముల ప్రకాష్ రావు అధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆదివారం ప్రారంబించారు.ఈ కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షులు ఎం అనిల్ కుమార్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకొని స్థానిక చౌరస్తాలో ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం హాజరైన మాజీ ఎంపి, పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్ కుమార్ యాదవ్ రాజీవ్ విగ్రహానికి పూలమాల వేసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నోముల ప్రకాష్ రావ్ మాట్లాడుతూ... సికింద్రాబాద్ నియోజకవర్గం ఎప్పుడో అభివృద్ధి చెందిందని ఇప్పుడు కొత్తగా బిఆర్ఎస్ ప్రభుత్వం చేసింది ఏమీ లేదన్నారు. ఇంతకాలం స్థానికులకు అవకాశం లేకపోవడం వల్ల ఇతరులు గెలుస్తూ వచ్చారని కానీ ఇప్పుడు ఎట్టి పరిస్థితుల్లోనూ స్థానికులకే సీటు కేటాయించే విధంగా అధిష్టానం దృష్టి సారించిందని పేర్కొన్నారు. తనకు టికెట్ ఇస్తే అత్యధిక మెజార్టీతో గెలిచి కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గౌరీ శంకర్, సాయికుమార్, సురేష్ లాల్, జగదీశ్ (జగ్గు),వహీద్ భాయ్, సాయి మధుకర్, అభిషేక్, కిషోర్ యాదవ్, శ్రీశైలం యాదవ్, బండి లక్ష్మణ్, వేణు, నాగులూరి అరుణ్, నాగులూరి శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# మెగా కలర్ బెల్ట్ టెస్ట్

**హైదరాబాద్,విశాలభారతి:** రుద్రమదేవి చోటా ఖాన్ కరాటే డో అసోసియేషన్ ఇండియా, తెలంగాణ ఆమ్ అట్యూర్ స్పోర్ట్స్ కరాటే డో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఖైరతాబాద్ మోడ్రన్ ఫంక్షన్ హాల్ లో మెగా కలర్ బెల్ట్ టెస్ట్ జరిగింది. యమకూచి మాస్టర్ కృష్ణ, టెక్నికల్ మాస్టర్ నారాయణ ఆధ్వర్యంలో జరిగిన టెస్ట్ పోటీలకు సుమారు 150 మంది విద్యార్థులు క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చీఫ్ ఎగ్జామినేషన్ మాస్టర్ రవి, ఫౌండేషన్ మాస్టర్ లక్ష్మి, స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీధర్ రావు, సరిత, సాయి గ్రూప్స్ డైరెక్టర్ డి ఎస్ రెడ్డి, ఫైసల్ అలీమ్ హాజరై ప్రతిభ కనబరిచిన విద్యార్థులు,మాస్టర్ క్రీడాకారులకు బెల్స్ సర్టిఫికెట్స్ అందజేసి మాట్లాడారు.

# 'పినపాక'లో పాగా ఎవరిదో?

- ఇప్పుడు ఉన్న వారి పని తీరు అంతంత మాత్రమే..
- కొత్త నాయకుణ్ణి కోరుకుంటున్న నియోజకవర్గ ప్రజలు
- పార్టీలు మారుతున్న లీడర్లపై ప్రజలు అసహనం
- బీజేపీ ఫోకస్ చేస్తే గెలుపు అవకాశాలు..







**మణుగూరు , విశాల భారతి :** పినపాక నియోజకవర్గ వ్యాప్తంగా, రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. బీఆర్ఎస్ అభ్యర్థి రేగా కాంతారావు పేరు దాదాపు ఖరారు అయింది. కాంగ్రెస్ పార్టీలో డజను మంది అభ్యర్థులు పోటీ పడుతున్నప్పటికీ , పొంగులేటి శ్రీనివాసరెడ్డి నీడలో నడుస్తున్న పాయం వెంకటేశ్వర్లుకే సీటు వస్తుందని లీకులు ఇస్తూ ఇతర పోటీదారుల్లో నిరుత్సాహాన్ని నింపుతున్నారన్న వార్తలు వస్తున్నాయి. ఇక బీజేపీలో ఓ సామాజిక సేవకుడిగా, లెక్చరర్ గా, లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ మెంబర్ గా, అమ్మా, నాన్న ఓల్డేజ్‌హోమ్ నిర్వాహకుడిగా, 'నేను సైతం' సోషల్ రెస్పాన్సిబిలిటీ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడిగా మంచి పేరున్న భూక్యా ప్రసాద్ అభ్యర్థిత్వం దాదాపు ఖరారు అయినట్టేనని పార్టీ నాయకులు చెప్తున్నారు.

2018 ఎన్నికల్లో రేగ కాంతారావు కాంగ్రెస్ అభ్యర్థిగా కమ్యూనిస్టులు, టీడీపీ మద్దతుతో ఎమ్మెల్యేగా గెలుపొందారు. తరువాత కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి వెళ్లారు. అధికారపార్టీ ఎమ్మెల్యేగా మారడంతో రేగా హవా మొదలైంది. కానీ నియోజకవర్గ అభివృద్ధిలో ఆయన విఫలమయ్యారన్న పేరు తెచ్చుకున్నారు. ప్రజల్లో కూడా ఆయనకు బాగా వ్యతిరేకత ఉందని సర్వేల్లో వెల్లడైంది. మాజీ ఎమ్మెల్యే అయిన పాయం వెంకటేశ్వర్లు నియోజకవర్గంలో చాప కింద నీరులా పనిచేసుకుంటూ పోతున్నారు. దీంతో పాయం వెంకటేశ్వర్లను టార్గెట్ చేసి రేగ కాంతారావు గతంలో మాట్లాడిన మాటలు మళ్లీ గుర్తు చేశారు. మాజీ ఎమ్మెల్యేను కాను నేను ప్రజెంట్ ఎమ్మెల్యేను అంటూ మాజీ ఎమ్మెల్యే పై తీవ్ర విమర్శలు చేశారు. మనస్థాపానికి గురైన పాయం పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెంట కాంగ్రెస్ లోకి వెళ్లిపోయారు. పాయం తరపున పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సైన్యంతో పలు చోట్ల సభలు పెట్టి ప్రోత్సహిస్తూ ధైర్యం ఇచ్చాడు. అదే సమయంలో సోషల్ మీడియా వేదికగా ఇరువురు ఘాటు విమర్శలు చేసుకున్నారు. రేగ కాంతారావు సుమారుగా 5 వేల ఎకరాల పోడు భూములను కబ్జా చేశారని పాయం ఆరోపిస్తున్నారు. బినామీల పేరుతో పట్టాలు ఇప్పించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. రేగ స్పందిస్తూ పోస్టులు పెట్టారు విమర్శలే తప్ప నేరుగా విమర్శించే చేతగాని వాడివి, ఎందుకు పనికిమాలిన మాటలు అంటూ చేసిన పోస్టులు తీవ్ర కలకలం సృష్టిస్తున్నాయి. దీంతో రేగా గ్రాఫ్ పడిపోయిందని నిఘా వర్గాలు చర్చించుకుంటున్నాయి. రేగా చెపితేనే కొంతమంది బీఆర్ఎస్ కార్యకర్తలు భూదందా, ఇసుక దందా, సెటిల్మెంట్ దందాలకు పాల్పడుతున్నట్లు సమాచారం. ఎంతో మంది పేద ప్రజల స్థలాలను భూములను కబ్జా చేశారని ఆరోపిస్తున్నారు. ఏదేమైనా పినపాక నియోజకవర్గ ప్రజలు కొత్త ముఖాన్ని కోరుకుంటున్నారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

**నిత్యం ప్రజల్లో ప్రసాద్‌నాయక్**

ప్రజల్లోకి పార్టీ గుర్తును, నరేంద్ర మోడీ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తూ, దేశం కోసం ధర్మం కోసం పినపాక నియోజక వర్గ సమగ్ర అభివృద్ధి కోసం అంటూ సోషల్ మీడియాలో,పత్రికలలో, పినపాక నియోజక వర్గ వ్యాప్తంగా ప్రసాద్ చేస్తున్న హడావిడి బీజేపీ గ్రాఫ్ పెంచుతోంది. ప్రస్తుతం ఆశావాహులు అందరిలో , నియోజక వర్గ వ్యాప్తంగా మిగిలిన వారి కంటే ఎక్కువగా ప్రసాద్‌కు లాభించే విషయం. బీజేపీ తరపున కొంత మంది అభ్యర్థులు ఒకరు పోలీస్ శాఖ నుంచి, మరొకరు విద్యుత్ శాఖ నుంచి, మరి కొంత అభ్యర్థులు మండల నాయకులు , జిల్లా నాయకులు, రాష్ట్ర నాయకులు టికెట్ ఆశిస్తున్నప్పటికీ పార్టీ హైకమాండ్ ఇంకా ఏ నిర్ణయం తీసుకోకపోవడంతో క్యాడర్ అయోమయంలో పడుతున్నారు.

గతం లో ఎమ్మెల్యే లుగా పని చేసిన రేగా కాంతారావు, పాయం వెంకటేశ్వర్లు ఇద్దరు ఒక పార్టీలో గెలిచి, మరో పార్టీలో జాయిన్ అయ్యి 'నేను కాకపోతే నువ్వు, నువ్వు కాకపోతే నేను' అన్న చందంగా రాజకీయాలు చేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. నియోజక వర్గం గిరిజన షెడ్యూల్డ్ నియోజక వర్గం అయినప్పటికీ, 70 % గిరిజనేతరులు ఉన్న నియోజక వర్గం గిరిననేతరుల సమస్యలు, అవసరాలు ఇక్కడ విభిన్నంగా ఉంటాయి. ఈ ప్రత్యేక పరిస్థితులను అర్థం చేసుకొని వ్యూహాత్మకంగా వ్యవహరిస్తే పినపాక నియోజక వర్గం బీజేపీ వశం కావడం కష్టమేమీ కాదు.



# అధైర్య పడొద్దు అన్నగా నేనున్నా

**పాలమూరు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి.**

**షాద్ నగర్,విశాలభారతి:** నియోజకవర్గంలో అక్కా చెల్లెళ్ళు, అన్నాతమ్ముళ్లు ఎవరూ అధైర్య పడొద్దని ఒక అన్నగా అందరికి అండగా ఉంటానని పాలమూరు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బిజేపీ సీనియర్ నేత పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి హామీ ఇచ్చారు. విష్ణు అన్న రాఖీ రక్ష చీరల పంపిణీ కార్యక్రమంలో బాగంగా ఆదివారం ఫరూక్ నగర్ మండలంలోని మొగిలిగిద్ద, బూర్గుల, నేరెళ్ల చెరువు గ్రామాల్లో విష్ణు అన్న రాఖీ రక్ష కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో 14 వ రోజు రెండు వేలకు పైగా చీరలను ఆడపడుచులకు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీ కష్టసుఖాల్లో తోడుంటానని, అండగా ఉంటానని అన్నాడు. ఆడపడుచులు రాఖీ కానుక అందుకొని దీవించాలని కోరారు. బిజెపి సీనియర్ నాయకులు ఇస్నాతి శ్రీనివాస్, ఆకుల ప్రదీప్, శ్యామ్ సుందర్ రెడ్డి, రఘు గౌడ్, భరత్, హరీష్, యాదయ్య, రాజు బిజెపి నాయకులు పాల్గొన్నారు.



# ట్రాక్టర్ మొక్కలను పడేశారు..

- 'హరితహారం' మొక్కల పంపిణీలో అధికారుల నిర్లక్ష్యం
- లక్షలాది ప్రజాధనం వృధా..

**బూర్గంపాడు, విశాల భారతి :** ఏటా జరిగే తంతుయే కదా అనుకున్నారేమో గానీ హరితహారం అధికారులు , సిబ్బంది గ్రామాల్లో పంచాల్సిన మొక్కలు కృష్ణ సాగర్ అడవిలో కుప్పలుగా పడేశారు. కానీ ఆ మొక్కలను ప్రజలకు పంచి పెట్టినట్లు రికార్డులలో రాసుకున్నారు. పచ్చని మొక్కలు నాటి చెట్లుగా పెంచడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకునేందుకు ప్రభుత్వం హరిత హారం పేరుతో ఖర్చు చేస్తున్న కోట్ల రూపాయల ప్రజాధనం ఇలా వృధా అవుతోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం కృష్ణసాగర్ అటవీ ప్రాంతంలో వృధాగా పడేసి ఉన్న వందలాది మొక్కలను ఆదివారం సీపీఎం నాయకులు గుర్తించడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. బూర్గంపాడు మండలంలో గ్రామపంచాయతీల పనితీరు పర్యవేక్షించాల్సిన మండల అధికారుల నిర్లక్ష్యం, అడవిలో పడి ఉన్న ఈ మొక్కల రూపంలో కనిపిస్తుంది. మండల పరిధిలో మొత్తం 17 గ్రామపంచాయతీలు ఉండగా అడవిలో పడేసి ఉన్న ఈ మొక్కల పాపం ఏ పంచాయతీవో అధికారులు తేల్చాల్సిన అవసరం ఉందని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఎంతో ఖర్చు చేసి శ్రద్ధగా నర్సరీల్లో పెంచిన మొక్కలను ఈ విధంగా చంపేయడం దారుణం అనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఇటీవల ప్రతి ఇంటికి ఐదు మొక్కలు చొప్పున ఇచ్చి వాటిని తప్పనిసరిగా నాటించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆ మొక్కలను పంచకుండా ఇలా చేశారని తెలుస్తోంది. ఈ నెల 26వ తేదీన ప్రభుత్వం అధికారికంగానే కోటి వృక్షార్చన పేరుతో చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలోని 948 ప్రదేశాల్లో 4.85 లక్షల మొక్కల నాటబోతున్నట్లుగా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఇటీవల ప్రత్యేక సమావేశంలో చెప్పారు. ఇంత ప్రాధాన్యం కలిగిన హరితహారంలో శ్రద్ధతో పని చేయాల్సిన అధికారులు సిబ్బంది ఇలా చేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక ట్రాక్టర్ లోడ్ కు పైగా మొక్కలను పడేసిన వారిని గుర్తించి కఠిన చర్యలు చేపట్టాలని సామాజికవేత్తలు డిమాండ్ చేస్తున్నారు.



# వృత్తిదారులపై చిత్తశుద్ధి ఏదీ?

**తుర్కయంజాల్, విశాలభారతి:** వడ్డెర వృత్తిదారుల సంఘం మున్సిపాలిటీ ఆఫీసును ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లపు విఘ్నేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల వృత్తులను ఆర్థికంగా ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ.లక్ష పథకం కార్యరూపం దాల్చకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం సరైన బడ్జెట్ కేటాయించకపోవడంతో పథకం అమలుకు కాలయాపన జరుగుతోందన్నారు. చాలా నియోజకవర్గాల్లో ఇంకా వెరిఫికేషన్ కూడా కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని చోట్ల అధికార పార్టీ కార్యకర్తలకే ఇస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం అర్హత కలిగిన ప్రతి వృత్తిదారుడికి పారదర్శకంగా ఆర్థిక సహకారం అందించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విశ్వకర్మ పథకానికి గైడ్‌లైన్స్ విడుదల చేసి వివిధ రాష్ట్రాలకు ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. తగిన నిధులు కేటాయించి వృత్తిదారుల పట్ల చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ముత్క శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులు నర్రా బిక్షపతి, తుర్కయంజాల్ మున్సిపాలిటీ వడ్డెర వృత్తిదారుల అధ్యక్షుడు నర్రా పాండు, ప్రధాన కార్యదర్శి సైదయ్య, ఉపాధ్యక్షుడు వెంకటేష్, కోశాధికారి నర్రా శ్రీధర్, కార్యనిర్వాహక సభ్యులు సందీప్, ఓర్సు శేఖర్, వరికుప్పల శ్రీకాంత్, వెంకన్న, చిరంజీవి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.



# రాబోయే ఎన్నికల్లో బీజేపీ జెండా పాతేద్దాం

**మంగళూర్ ఎమ్మెల్యే వేదవ్యాస్ కామత్**

**షాద్ నగర్,విశాలభారతి:** తెలంగాణ రాష్ట్రంతో పాటు షాద్నగర్ నియోజకవర్గంలో రానున్న ఎన్నికల్లో బిజెపి విజయబావుటా మోగించి జెండా పాతేద్దామని కర్ణాటక రాష్ట్ర మంగుళూరు శాసనసభ్యులు వేదవ్యాస్ కామత్ పిలుపునిచ్చారు. ఆదివారం బిజెపి కేంద్ర పార్టీ ఆదేశాల మేరకు ప్రభాస్ అభియాన్ లో భాగంగా షాద్నగర్ పట్టణానికి విచ్చేసిన వేదవ్యాస్ కామత్ స్థానిక నాయకులతో సమావేశమయ్యారు. కోఆర్డినేటర్ దేపల్లి అశోక్ గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ డా విజయ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణా లో బిజెపి అధికారంలోకి రావాలని, కేంద్ర నాయకత్వం ఆదేశాల మేరకు షాద్ నగర్ పట్టణానికి రావడం జరిగిందన్నారు. ప్రధాని మోడీ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులకు సూచనలు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ నియంతృత్వ, నిరంకుశ, కుటుంబ పాలనకు ప్రజలు వ్యతిరేకంగా ఉన్నారని,ఈ వ్యతిరేకతను పార్టీ కార్యకర్తలు అందిపుచ్చుకునేందుకు అహర్నిశలు కృషి చేయాలన్నారు. ఎన్నికల్లో అధికార పార్టీ ఎన్ని దొంగ హామీలు ఇచ్చినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ కూడా కుటుంబ రాజకీయాలు చేసిందని, మోడీ ప్రభుత్వం తెలంగాణాలో కూడా రావాలని ప్రజలు ఆశిస్తున్నారని ఆ దిశగా ప్రతి నాయకుడు ముందుకు సాగాలన్నారు. షాద్ నగర్ లో అధికారమే లక్ష్యంగా అందరూ కలిసికట్టుగా పని చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, అందె బాబయ్య, మిథున్ రెడ్డి, భూపాల చారి, వెంకటేష్ గుప్త, చెంది మహేందర్ రెడ్డి,పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, పట్టణ అధ్యక్షులు మఠం ఋషికేష్, మహేందర్ రెడ్డి, నాగరాజు చారి, నర్సింహా యాదవ్, సుధాకరప్ప, కొమరబండ శ్రీశైలం, వెంకటేష్ యాదవ్, బోయ కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.



## లద్దాఖ్ లో ఘోర ప్రమాదం

**షాద్ నగర్ ఆర్మీజవాన్ దుర్మరణం**



**షాద్ నగర్,విశాలభారతి :** లద్దాఖ్ లోని ఖేరి సమీపంలో ఘోర ప్రమాదం జరిగి తొమ్మిది మంది ఆర్మీ జవాన్లు మృతి చెందిన విషయం తెలిసిందే. భారత జవాన్లు ప్రయాణిస్తున్న వాహనం అదుపు తప్పి లోయలో పడిపోవడంతో తొమ్మిది మంది జవాన్లు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఈ ప్రమాదంలో షాద్ నగర్ నియోజకవర్గం కొందుర్గ్ మండలం తంగెళ్లపల్లి గ్రామ పంచాయతీ తిర్మాన్ దేవుని పల్లి గ్రామానికి చెందిన ఆర్మీ సైనికుడు నీరటి చంద్రశేఖర్ ముదిరాజ్ (30)మృతిచెందాడు. నిరుపేద కుటుంబానికి చెందిన మల్లయ్య ,శివమ్మలకు ముగ్గురు సంతానం. అందరిలో చిన్నవాడు చంద్రశేఖర్ ముదిరాజ్. ఒకటవ తరగతి నుండి 3 వ తరగతి వరకు తిర్మాన్ దేవునిపల్లి గ్రామంలో, 4వ తరగతి నుండి 7 తరగతి వరకు తంగెళ్లపల్లి గ్రామంలో, తర్వాత కొందుర్గ్ లో బీసీ హాస్టల్ లో ఉంటూ 10వ తరగతి వరకు చదువుకున్నాడు.దేశానికి సేవ చేయాలనే లక్ష్యంతో పదవ తరగతి పూర్తి కాగానే ఆర్మీలో జాయిన్ అయిన చంద్రశేఖర్ ప్రమాదంలో మృతిచెందంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# నేడు విడుదల.... సర్వత్రా ఉత్కంఠ..!

- **సిట్టింగులకే కేసీఆర్ పచ్చజెండా**
- **సోమవారం మంచిరోజునే ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితా విడుదల చేస్తారని విస్తృత ప్రచారం**
- **ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో తొమ్మిదింటికి తొమ్మిది ఒకే**
- **కామారెడ్డికి కేసీఆర్...? ఇంకా ప్రచారంలోనే ఉన్న కామారెడ్డి అభ్యర్థి**
- **ఒకవేళ రేపు మిస్ అయితే... సిట్టింగుల్లో మార్పులు తథ్యమేనని సంకేతం**



**నిజామాబాద్, విశాలభారతి:** అందరూ ఎంతో ఆసక్తిగా, ఉత్కంఠగా ఎదురుచూస్తున్న రానే వచ్చింది. బీఆరెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితాను రేపు (శ్రావణ సోమవారం) ప్రకటించేందుకు అధినేత, సీఎం కేసీఆర్ సిద్దమయినట్టు విశ్వసనీయంగా తెలిసింది. రేపు మంచి రోజు కావడంతో దాదాపు 85 శాతం మంది సిట్టింగులకే తిరిగి ఎమ్మెల్యే అభ్యర్థుల చాన్స్ ఇవ్వనున్నట్టు తెలిసింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో మొత్తం తొమ్మిది నియోజకవర్గాలున్నాయి. వీరందరికీ మళ్లీ అవకాశం వచ్చే అవకాశం వందశాతం ఉంది. నిజామాబాద్ రూరల్, కామారెడ్డి నియోజకవర్గ విషయాల్లో ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ రెండింటివి వేర్వేరు కారణాలు.. కానీ ఉత్కంఠ, ప్రచారం మాత్రం అభ్యర్థుల జాబితా విడుదలయ్యే వరకు కొనసాగేలా ఉంది.నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం విషయా నికి వస్తే ఇక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్దన్‌కు టికెట్ కన్ఫాం. కానీ.. బాజిరెడ్డి తన తనయుడు బాజిరెడ్డి తనయుడు బాజిరెడ్డి తనయుడికి ఇవ్వాల్సిందిగా అధిష్టానాన్ని కోరుతున్నాడు. గత సార్వత్రిక ఎన్నికల్లో కూడా అధిష్టానాన్ని కోరినా..అప్పుడు సమీకరణలు కుదరలేదు. అధిష్టానం సూచన మేరకు తనే పోటీ చేశాడు బాజిరెడ్డి. కానీ ఈసారి తప్పకుండా తన కొడుకుకే చాన్స్ ఇస్తారనే నమ్మకంతో ఉన్నాడు. కేసీఆర్‌తో పాటు, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత, మంత్రి ప్రశాంత్‌రెడ్డిలతో తన అంతరంగాన్ని ఆవిష్కరించారు బాజిరెడ్డి. ఇక ఫైనల్ డిషసన్ అధినేతకే వదిలేశాడు. కామారెడ్డి నియోజకవర్గంలో కేసీఆర్ పోటీ చేస్తారనే ప్రచారం కొంతకాలంగా సాగుతోంది. ఇక్కడ కేసీఆర్‌కు తన కుటుంబ మూలాలున్నాయి. అందుకే ఇక్కడ నుంచి తను పోటీ చేస్తే ఉమ్మడి జిల్లాతో పాటు కరీంనగర్, మెదక్ జిల్లాల పై కూడా ప్రభావం చూపి బీఆరెస్ అభ్యర్థులంతా గెలుపు తీరాలకు చేరుతారనే ఓ అంచనా ఉంది. కానీ కేసీఆర్ మనసులో మాట ఎవరూ చెప్పలేరు కదా.. దీంతో కామారెడ్డి విషయంలో ఇంకా సస్పెన్స్ కొనసాగుతూ వస్తోంది. ఒకవేళ కామారెడ్డి నుంచి సీఎం కేసీఆర్ వచ్చి పోటీ చేస్తానంటే తనకెంతో హ్యాపీ అంటూ సిట్టింగ్ ఎమ్మెల్యే గంప గోవర్దన్ కూడా పలు మార్లు మీడియా ముందు చెప్పిన విషయం తెలిసిందే.

సీఎం కేసీఆర్ కాకపోతే ఆ సీటు సిట్టింగుకే. అందులో అనుమానం లేదు. ఏది జరిగినా తన మంచికే అనుకుంటున్నాడు గంప గోవర్దన్. ఇక బాల్కొండ నుంచి మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఆర్మూర్ నుంచి ఆశన్నగారి జీవన్‌రెడ్డి, అర్బన్ నుంచి బిగాల గణేశ్ గుప్తా, బోధన్ నుంచి షకీల్, బాన్సువాడ నుంచి పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఎల్లారెడ్డి నుంచి నల్లమడుగు సురేందర్, జుక్కల్ నుంచి హన్మంత్ షిండేలకు సీట్లు ఖరారైపోయాయి. రేపు ప్రకటనే తరువాయిగా మిగిలి ఉంది. ఒకవేళ సీఎం కేసీఆర్ రేపు (సోమవారం) అభ్యర్థుల ప్రకటన చేయని పక్షంలో.. చాలా చోట్ల సిట్టింగుల మార్పు ఉండనుందనే సంకేతం ఇచ్చినట్టుగా భావించవచ్చని ఆ పార్టీ సీనియర్ నేత ఒకరు వాస్తవం ప్రతినిధితో చెప్పారు. దీంతో అభ్యర్థుల ప్రకటనపై తీవ్ర ఉత్కంఠ నెలకొన్నది. మరోవైపు సోషల్ మీడియాలో ఎవరికి తోచింది వారు రాసుకుంటూ పోవడంతో సిట్టుంగుల్లో కూడా అయోమయ పరిస్థితిని క్రియేట్ చేస్తున్నారు. మాకే అంటూ మేకపోతే గాంభీర్యాన్ని ప్రదర్శిస్తూనే.. ఓ వైపు లోలోన తీవ్ర టెన్షన్‌కు గురవుతున్నారు సిట్టింగులు.



## కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ

- **చేతికి ఐదు వేళ్ళు - చేస్తాం ఐదు మేళ్లు**
- **గడప గడపకు కాంగ్రెస్**

**అమనగల్లు,విశాలభారతి:** చేతికి ఐదు వేళ్ళు చేస్తాం ఐదు మేళ్లు అంటూ కల్వకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ప్రతి గడపకి కాంగ్రెస్ నాయకులతో కలిసి వెళ్లారు. ఆదివారం అమనగల్లు మండలం మాలేపల్లి,చెన్నంపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొని జెండా ఆవిష్కరణ చేశారు.ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ఇతర పార్టీలకి చెందిన నాయకులను సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కండువాలు కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ...కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ అని ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ని గెలిపించి పేదల ప్రభుత్వాన్ని ఏర్పాటు చేద్దామన్నారు...తెలంగాణ తెచ్చిన కాంగ్రెస్ పార్టీ తో పాటు తెలంగాణ ఇచ్చిన తెలంగాణ తల్లి సోనియమ్మ రుణం తీర్చుకుందాం అన్నారు.అనంతరం గ్రామంలో పర్యటించి కాంగ్రెస్ పార్టీ మేనిపెస్టోని గడప గడపకి తిరిగి ప్రజలకి వివరించారు. గ్రామంలోని ఆరోగ్య సమస్యలతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న కుటుంబాలని పరామర్శించి అండగా ఉంటామని హామీ ఇచ్చారు..ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు తెలగమల్ల రవి,సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ రమణ రెడ్డి ,ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు జగన్,కాంగ్రెస్ నాయకులు బొబ్బిలి, మండల అధ్యక్షులు మండ్లి రాములు,అమనగల్లు టౌన్ ప్రెసిడెంట్ వస్పుల మానయ్య,కిసాన్ సెల్ ప్రెసిడెంట్ కొండల్ రెడ్డి , పులికంటి మైసయ్య సీనియర్ నాయకులు లక్ష్మయ్య,నర్సింహా ,వెంకటేష్ ,మహేష్ ,యాదయ్య ,మహేందర్ ,తిరుపతి లతో పాటు యూత్ కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మరియు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



## ఆధార్ సెంటర్ పునరుద్ధరించాలి

**అమనగల్లు,విశాలభారతి:** అమనగల్లు మండల కేంద్రంలో ఆధార్ సెంటర్ ను పునరుద్దరించాలని బిజెవైయం ఆధ్వర్యంలో ఆదివారం మాజీ జాతీయ ఓబిసి కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమనగల్లు మండల కేంద్రంలో ఆధార్ సెంటర్ లేక మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నామని ఆధార్ మొబైల్ లింకు చేసుకోవాలన్న కొత్త ఆధార్ కార్డు లేదా అప్డేట్ అప్లై చేసుకోవాలన్న సుమారు 40 కిలోమీటర్ల దూరం లోగల కల్వకుర్తి, లేదా ఇతర మండలాలకు వెళ్లాల్సి వస్తుందని దీనివల్ల సమయం వృధా అవ్వడమే కాకుండా ఆర్థికంగా ఇబ్బందులు గురవుతున్నామన్నారు. మండల కేంద్రంలో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేసి ఇబ్బందులను తొలగించాలని అధికారులను వేడుకున్నారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి వగ్గు ప్రభాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భగీరథ, బిజెవైయం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కండె సాయి ,కల్వకుర్తి నియోజకవర్గం బిజెపి పార్టీ మీడియా ఇన్చార్జ్ రవిరాథోడ్, ఆమనగల్లు మండల బీజేవైఎం అధ్యక్షులు శ్రీనివాస్, గిరిజన మోర్చా అధ్యక్షులు హన్మంత్ నాయకులు పాల్గొన్నారు.



## రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం

**అమనగల్లు,విశాలభారతి:** స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను అమనగల్లు ,కడ్తాల్, తలకొండపల్లి మండల కేంద్రంలో ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలల వేసి నివాళులుఅర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ హయాంలో రాజీవ్ గాంధీ చేసిన సేవలు మరువలేనివన్నారు.రాజీవ్ చేసిన సేవలను కొనియాడారు. సాంకేతికను భారత దేశానికి తెచ్చిన ఘనత రాజీవ్ గాంధీకే దక్కుతుందన్నారు. ఆయనచిరకాలం ప్రజల గుండెల్లో ఉంటారని పేర్కొన్నారు.ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్క కార్యకర్త కృషిచేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గద్దెనెక్కి పేద ప్రజలపై మోయలేని టాక్సులు వేస్తూ.ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తూ ప్రజా వ్యతిరేకపాలన కొనసాగిస్తున్నారని ప్రజలు త్వరలోనే బుద్ధిచెప్తారన్నారు. కాంగ్రెస్ పార్టీ దేశానికి, రాష్ట్రానికి చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకు వెళ్తూ కార్యకర్తలు పనిచేయాలన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## మొక్కలను పెంచి భావితరాలకు స్వచ్ఛమైన గాలిని అందించాలి

- **ఘనంగా జర్పుల దశరథ్ నాయక్ జన్మదిన వేడుకలు**
- **ఎమ్మెల్యే జైపాల్ యాదవ్,జడ్పీ చైర్ పర్సన్ అనిత**

**అమనగల్లు,విశాలభారతి:** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని, మొక్కలను పెంచి భావితరాలకు స్వచ్ఛమైన గాలిని అందించాలని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, జడ్పీ చైర్ పర్సన్ అనిత రెడ్డి అన్నారు.ఆదివారం కడ్తాల్ పట్టణ కేంద్రంలో జడ్పీటీసీ, జర్పుల చారిటబుల్ ట్రస్ట్ అధినేత జర్పుల దశరథ్ నాయక్ జన్మదిన వేడుకలను బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు,కార్యకర్తల, అభిమానుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. సుమారు 10వేల మందితో భారీగా ర్యాలీ చేపట్టారు. జాతీయ రహదారి మొత్తం జన్మదిన వేడుకల ఆనందోత్సాహలతో నిండిపోయింది.బాణాసంచా కాలుస్తూ యువకులు, మహిళలు కోలాటలతో సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే శ్రీరామ రక్ష అన్నారు. అనంతరం జడ్పీటీసీ మాట్లాడుతూ పేదప్రజలకు అండగా జర్పుల చారిటబుల్ ట్రస్ట్ అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ వెంకటేష్, ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి,వెల్దండ, శంషాబాద్, కేశంపేట జడ్పీటీసీలు విజిత రెడ్డి,తన్వి రాజ్, విశాల,కడ్తాల్, తలకొండపల్లి,ఆమనగల్లు మున్సిపాలిటీ,మాడ్గుల మండల బిఆర్ఎస్ అధ్యక్షులు పరమేష్,శంకర్,పత్య నాయక్,జైపాల్ రెడ్డి,వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.





## మొక్కలు నాటడం సామాజిక బాధ్యత

**భీమ్‌గల్ మున్సిపల్ చైర్ పర్సన్ కన్నె ప్రేమలత సురేందర్**

బాల్కొండ,విశాలభారతి: మొక్కలు నాటడం సామాజిక బాధ్యతని భీమ్‌గల్ మున్సిపల్ చైర్ పర్సన్ కన్నె ప్రేమలత సురేందర్ అన్నారు. ఆదివారం భీమ్‌గల్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో హరితహారం కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ కన్నె ప్రేమలత సురేందర్ హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా 1,2,3 వార్డులలో ప్రజలకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ మొక్కలు పెంచి ఆరోగ్యవంతమైన తెలంగాణగా మార్చాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని అన్నారు. అందుకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని తెలిపారు.అనంతరం స్వర్ణకార వర్తక సంఘంలో సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ దారావత్ లింగయ్య, నాయకులు శ్రీపాద గోపి, మంచిర్యాల రమేష్, ఆరెపల్లి నరేందర్,గోవర్ధన్,అరుణ్, సాగర్, మున్సిపల్ సిబ్బంది,మెప్మా ఆర్.పిలు తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ పార్టీ సముచితస్థానం

**టిపిసిసి సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్**



**అమనగల్లు,విశాలభారతి:** కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పార్టీ అభివృద్ధి కోసం పని చేసిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం దక్కడం ఖాయమని టిపిసిసి సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఎంతో కాలం నుండి సేవలు అందిస్తున్న చల్లా వంశీచందర్ రెడ్డి, జాతీయ కాంగ్రెస్ పార్టీలో అత్యంత కీలకమైన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సిడబ్ల్యూసి )లో ప్రత్యేక ఆహ్వానితుడిగా ఎన్నికవడమే ఇందుకు నిదర్శమని ఆయన అన్నారు. పార్టీ అభివృద్ధికి కష్టపడుతూ అంచలంచలుగా ఎదిగిన చల్లా వంశీ చంద్ రెడ్డి శ్రీనివాస్ గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ లో విద్యార్థి దశ నుండి ఎన్ఎస్యుఐ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లో యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా, కల్వకుర్తి శాసనసభ్యునిగా, మహారాష్ట్ర ఇన్చార్జిగా, ఏఐసీసీ సెక్రటరీగా, మహబూబ్నగర్ పార్లమెంట్ ఇంచార్జిగా, ఏ బాధ్యతలు అప్పజెప్పిన అధిష్టానానికి విధేయుడుగా ఉంటూ వంశీచంద్ రెడ్డి పార్టీ అభివృద్ధిలో పాలుపంచుకున్నారన్నారు. కల్వకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తరపున కాంగ్రెస్ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలుపుతూ చల్లా వంశీచంద్ రెడ్డి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.



## ప్రజల గుండెల్లో రాజీవ్ ది చెరగని ముద్ర

**టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లిశంకర్**

**షాద్ నగర్,విశాలభారతి:** దేశ ప్రజల గుండెల్లో రాజీవ్ గాంధీ చెరగని ముద్ర వేసుకున్నారని,పేద ప్రజల భవిష్యత్తును మార్చిన రాజీవ్ గాంధీని దైవ సమానులుగా దేశ ప్రజానీకమంతా భావిస్తున్నారని టిపిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం షాద్ నగర్ మున్సిపాలిటీ అధ్యక్షుడు కె.చెన్నయ్య ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ హాజరయ్యారు. ముందుగా రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ స్వార్థం లేని రాజకీయ నాయకుల్లో రాజీవ్ గాంధీ ఒకరని, చిన్న వయసులోనే ప్రధానమంత్రి బాధ్యతలు చేపట్టి పేద ప్రజల గుండెల్లో నిలిచిన వ్యక్తి అని ఆయన కొనియాడారు. దేశం కోసం గాంధీ కుటుంబం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా నిస్వార్థ పరిపాలన అందించిందని గుర్తు చేశారు. ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ ఆశయాలను కాంగ్రెస్ పార్టీ కొనసాగిస్తుందన్నరు. ఈ కార్యక్రమంలో ఫరూక్ నగర్ మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్ రెడ్డి, కొందుర్గ్ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, పిసిసి నెంబర్ బాబర్ ఖాన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజ్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ యాదయ్య, చటాన్ పల్లి కౌన్సిలర్ శ్రీనివాస్, నాయకులు పురుషోత్తం రెడ్డి, జితేందర్ రెడ్డి, కృష్ణారెడ్డి, మసూద్ ఖాన్, ఖదీర్, ముబారక్, అందేమోహన్, హైదర్ గోరి, ఆసిఫ్ గోరి, బాబా, జఫర్ ఖాన్, గణేష్, నవీన్, రాయికల్ శ్రీనివాస్, బచ్చలి నరేష్, గంగనమోని సత్తయ్య, అప్పారెడ్డిగూడ మాజీ సర్పంచ్ మల్లేష్, సీతారాములు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## మధ్యాహ్న భోజన కార్మికుల వేతనం పెంచాలి

**మఠంపల్లి, విశాల భారతి :** సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలో సీఐటీయూ మండల కమిటీ సమావేశం శాంతి కుమారి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం మధ్యాహ్న భోజనం కార్మికులకు రూ. 3000 వేతనం ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఇంతవరకు అమలు చేయకపోవడం బాధాకరమైన విషయం అన్నారు. జీపీ కార్మికుల సమస్యలను పరిష్కరించకపోవడం వల్ల జీపీ కార్మికులపై సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నార్నారు. వెంటనే జీపీ కార్మికుల సమస్యల పరిష్కరించాలని, కాంట్రాక్ట్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ డబుల్ బెడ్‌రూం ఇండ్లు ,కొత్త రేషన్ కార్డులు వెంటనే ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు . ఈ కార్యక్రమం లో మండల కన్వీనర్ సయ్యద్ రనీమియా ,గ్రామ పంచాయతీ అధ్యక్షుడు ఇంటి .రవి ,స్వీపర్ల సంఘం మండల కార్యదర్శి లాల్ సాహెబ్ , స్వీపర్ల అధ్యక్షురాలు కుమారి, పూల సంఘం మండల కార్యదర్శి నాగరాజు, గోవిందమ్మ ,సంతోషి, దేవదానం ,భవాని తదితరులు పాల్గొన్నారు.

## చేనేత కార్మిక సంఘం కొత్త కమిటీ ఎన్నిక



**పాలేరు, విశాల భారతి :** తెలంగాణ అభివృద్ధిలో చేనేత కార్మిక సంఘాలది ప్రత్యేక పాత్ర అని చేనేత కార్మిక సంఘం బీరోలు ఉపాధ్యక్షుడు యలగందుల వీరభద్రం అన్నారు. చేనేత కార్మిక సంఘం కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. బీరోలు గ్రామ అధ్యక్షకార్యదర్శులు గా గూడూరు రమేష్, యలగందుల మల్సూర్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఖమ్మం జిల్లా తిరుమలయపాలెం మండలం బీరోలు గ్రామంలో యమ్.వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఈ కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో బీరోలు, ఎలువారిగూడెం, దమ్మాయిగూడెం, పాతర్లపాడు, మెడిదపల్లి గ్రామ పద్మశాలీలు పాల్గొన్నారు. కొత్త కార్యవర్గ ఉపాధ్యక్షుడి గా యలగందుల వీరభద్రం, కార్యదర్శి రవ్వల ఉపేందర్, కోశాధికారి గూడూరు కృష్ణను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇ.సీ మెంబర్స్ గా గూడూరు ఉపేందర్, గూడూరు వెంకన్న, చెన్న సురేష్, పాముల ఉపేందర్, యామిని శ్రీనివాస్, మిట్ట కోల నవీన్, పద్మశాలీలు పాల్గొన్నారు.

# భద్రాచలం ఎమ్మెల్యే అభ్యర్థి ఎవరు?

- గులాబీ దళంలో మొదలైన ఉత్కంఠ
- పోటీలో వెంకట్రావు, బుచ్చయ్య
- గత కొంత కాలంగా వర్గపోరు





**భద్రాచలం, విశాల భారతి :** భద్రాచలం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎవరు అనే ఉత్కంఠ నెలకొంది. ఎవరికి టికెట్ ఇస్తారని క్యాడర్ టెన్షన్‌గా చూస్తోంది. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అనుచరుడిగా పేరు తెచ్చుకున్న తెల్లం వెంకట్రావు ఆయనతో పాటు కాంగ్రెస్‌లో చేశారు. అనంతరం తక్కువ కాలంలోనే భద్రాచలం అసెంబ్లీ టికెట్ ఆశించి కేటీఆర్ సమక్షంలో మళ్లీ బీఆర్ఎస్‌లో చేరారు. అయితే ఆయనకు టికెట్ హామీతోనే పార్టీ హైకమాండ్ పార్టీలో చేర్చుకుందని పార్టీ వర్గాలు ప్రచారం జరుగుతోంది. గతంలో తెల్లం వెంకట్రావు కాంగ్రెస్‌లో చేరడం వలన చర్ల మండలానికి చెందిన మాజీ మార్కెట్ చైర్మన్ బోదెబోయిన బుచ్చయ్య ఎమ్మెల్యే టికెట్ కోసం రంగంలోకి దిగాడు. అందుకోసం 5 మండలాల తన అనుచరులను అలర్ట్ చేసుకొని పార్టీ పనుల్లో నిమగ్నమయ్యారు.

**వెంకట్రావు రీ ఎంట్రీతో వర్గపోరు..**

వెంకట్రావు కేటీఆర్ సమక్షంలో తిరిగి జాయిన్ అవ్వగా.. ఒక్కసారిగా నియోజకవర్గంలో రాజకీయ ప్రకంపనలు మొదలయ్యాయి. బీఆర్ఎస్ లో రెండు వర్గాలుగా ఏర్పడ్డాయి. ఎమ్మెల్యే టికెట్ కోసం ఇరు వర్గాల మధ్య వర్గ పోరు తారాస్థాయికి చేరింది. దీంతో బీఆర్ఎస్ కార్యకర్తలు, సెకండ్ క్యాడర్ లీడర్లు ఎవరి వెంట నడవాలో తెలవని పరిస్థితుల్లో అయోమయంలో పడ్డారు.

**ఇద్దరికీ మంచి పేరు..**

డాక్టర్ తెల్లం వెంకట్రావు. సౌమ్యుడు ప్రజల మన్నన చూరగొన్న వ్యక్తిగా పేరుంది. అలాగే డాక్టర్ గా ఆయన అనేక మంది నిరుపేద రోగులకు వైద్యం చేస్తూ ప్రజలకు చేరువయ్యారు. అసెంబ్లీ టికెట్ ఆశిస్తున్న మరో వ్యక్తి బోదె బోయిన బుచ్చయ్య కూడా అదే స్థాయిలో మంచి సేవా గుణమున్న వ్యక్తిగా ప్రజల్లో పేరు తెచ్చుకున్నారు. ఇద్దరు ఎమ్మెల్యే టికెట్ కోసం ఎవరి ప్రయత్నాలు వారు చేస్తుండడం ఎవరికి వస్తుందోనని క్యాడర్ ఉత్కంఠగా చూస్తున్నారు. బోధ బోయిన బుచ్చయ్య ఐదు మండలాల బీఆర్ఎస్ లీడర్లతో కలిసి వెళ్లి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావుకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని వినతి పత్రం ఇచ్చారు. దీంతో భద్రాచలం అసెంబ్లీ టికెట్ ఎవరిని వరిస్తుందో చూడాలి.



## ముందస్తు అరెస్టులు దుర్మార్గం

**సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి**

**సూర్యాపేట, విశాల భారతి :** సీఎం కేసీఆర్ సూర్యాపేట జిల్లా పర్యటన సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మది వెంకటేశ్వర్లు ను వామపక్ష , ప్రజాసంఘాల నాయకులను తెల్లవారుజామున ముందస్తు అరెస్టులు చేయడం దుర్మార్గమని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి ఖండించారు. సీపీఎం జిల్లా కమిటీ తరపున ఒక ప్రకటన విడుదల చేశారు. సీఎం కేసీఆర్ సూర్యాపేటలో అభివృద్ధి కార్యక్రమాలను పేరుతో ప్రశ్నించే గొంతులను బంధించడం మూర్ఖమైన పని అన్నారు. ఈ అరెస్టులను ప్రజలు, ప్రజాతంత్ర వాదులు, మేధావులు ఖండించాలన్నారు.



## కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు రెగ్యులరైజేషన్ చేయాలి

- తెలంగాణ స్టేట్ యూనివర్సిటీ కాంటాక్ట్ టీచర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ ధర్నా చౌక్ లో ధర్నా..
- హాజరై మాట్లాడిన ప్రొఫెసర్ హర గోపాల్..

**హైదరాబాద్,విశాల భారతి:** తెలంగాణ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు ను రెగ్యులరైజేషన్ చేయాలని ప్రొఫెసర్ హర గోపాల్ డిమాండ్ చేశారు. ప్రతి ఒక్కరికి విద్యా కోసం విద్యా హక్కు చట్టం తేవాలని కామన్ సిలబస్ పెట్టాలని 40 సంవత్సరాలుగా పోరాడుతున్నానని తెలిపారు. ప్రభుత్వాన్ని మౌలిక ప్రశ్నలు అడుగుతున్నాం పరిష్కరించడంలో ఇబ్బంది ఏమిటని ప్రశ్నించారు. తెలంగాణలో ఉన్నటువంటి 12 విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న 1445 మంది కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజేషన్ చేయాలని కోరుతూ తెలంగాణ స్టేట్ యూనివర్సిటీ కాంటాక్ట్ టీచర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఇందిరా పార్క్ ధర్నా చౌక్ లో సామూహిక సమర దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు ఎంపీ ఆర్ కృష్ణయ్య, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, ప్రొఫెసర్ హర గోపాల్ హాజరై కాంట్రాక్టు టీచర్లకు మద్దతు పలికారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంట్రాక్టు వ్యవస్థ పోవాలన్నారు. పిల్లలు వస్తూనే ఉంటారు... చదువు ఆగిపోయేది కాదు.. అటువంటప్పుడు కాంట్రాక్టు లెక్చరర్స్ వ్యవస్థ ఎందుకని ప్రశ్నించారు. నిరంతరంగా చదువు కొనసాగుతున్నప్పుడు విద్యార్థులకు చదువు తగ్గట్టుగా నియామకాలు చేపట్టవలసిన అవసరం రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ఇప్పటికైనా కాంట్రాక్ట్ విశ్వవిద్యాలయాల అధ్యాపకులను వెంటనే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ విద్యార్వతలు కలిగి ఉండి 20 ఏళ్ల నుంచి యూనివర్సిటీలో సేవ చేస్తూ యూనివర్సిటీ ఉన్నతికి కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు కృషి చేశారని తెలిపారు. వీరిని రెగ్యులరైజేషన్ చేయవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తానని అందుకు మీరు ఐక్యంగా పోరాటం చేయాలని కోరారు. రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ అసిస్టెంట్ ప్రొఫెసర్లు ను రెగ్యులరైజేషన్ చేయవలసిన అవసరం ఉందని, ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. జేఏసీ చైర్మన్ వేల్పుల కుమార్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల్లో బోధిస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు రెగ్యులర్ అధ్యాపకులతో సమానంగా బోధిస్తున్నారని, అడ్మినిస్ట్రేటివ్ విధుల్లో సైతం సమానంగా సేవలు అందిస్తున్నారని తెలిపారు. వారు మాకంటే ఏమీ ఎక్కువ కాదని అదేవిధంగా కాంట్రాక్ట్ అధ్యాపకులు లేకుండా విశ్వవిద్యాలయలు లేవని కావున రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజేషన్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సామూహిక సమర దీక్షలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు తాళ్లపల్లి వెంకటేశ్, డాక్టర్ ఎస్ ఎన్ అర్జున్ కుమార్,సి విజేందర్ రెడ్డి, డాక్టర్ చీర రాజు, డాక్టర్ ఉపేందర్ రావు, భవాని, రాధిక, లక్ష్మి, మాధవి తదితరులు పాల్గొన్నారు.



## నగరాభివృద్ధికి సమష్టిగా పనిచేయాలి

**ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్**

**హనుమకొండ , విశాల భారతి :** నగరాభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా పనిచేయాలని ప్రభుత్వ విఫ్ దాస్యం వినయ్ భాస్కర్ సూచించారు. హనుమకొండ పట్టణంలోని వడ్డేపల్లి పార్కులో 60వ డివిజన్ అభివృద్ధి కార్యక్రమాల కోసం ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల అధికారులతో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇందులో ప్రధానమైన 5 సమస్యల గురించి ప్రస్తావించారు. ఈ సందర్భంగా వినయ్ భాస్కర్ మాట్లాడుతూ నగరాభివృద్ధిలో భాగంగా రోడ్డు వెడల్పు, డ్రైనేజీ నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలన్నారు. పెరుగుతున్న జనాభా ప్రాతిపదికన రోడ్ల నిర్మాణం చాలా చిన్నదిగా ఉందని అందుకోసం రోడ్లను వెడల్పు చేసే బాధ్యతను కూడా కు అప్పగించామని తెలిపారు. వడ్డేపల్లిలో పోచమ్మ, మైసమ్మ పండుగల నిర్వహణ తేదీలను అశోక్ పూజారిని అడిగి సెప్టెంబర్ 3న మైసమ్మ పండుగ, సెప్టెంబర్ 10వ తేదీన పోచమ్మ పండుగ ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు 60వ డివిజన్ పరిధిలో పూర్తిగా ఇండ్లు కోల్పోయిన వారికి డబుల్ బెడ్ రూం ఇండ్లను ఇస్తామని, పాక్షికంగా ధ్వంసమైన ఇండ్ల కు ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని అన్నారు. గృహలక్ష్మి పథకం కింద అర్హులైనటువంటి లబ్ధిదారులు అప్లై చేసుకోవాలన్నారు. ఇది నిరంతర ప్రక్రియ అని తెలిపారు. ఇప్పటికే అర్హులైన వారిని ఎంపిక చేసి వారికి బీసీ బందు పథకం కింద రూ. 1 లక్ష రుణ సహాయాన్ని 300 మందికి అందించామని, మరొక దఫా కూడా ఈ విధంగా అప్లై చేసుకోవాలన్నారు. కళాశాలకు సంబంధించిన విషయంపై కూడా కాలేజీ ప్రాంగణంలో బురద కాకుండా మొరం, డస్ట్ పోయిస్తానన్నారు. విద్యుత్ సమస్యలను కూడా వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్, మాజీ కార్పొరేటర్ స్వప్న, శ్రవణ్ కుమార్ పాల్గొన్నారు.



## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**జఫర్ గడ్, విశాల భారతి :** మండల కేంద్రంలోని జఫర్గడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1983- 84 అకడమిక్ ఇయర్ టెన్త్ క్లాస్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు చెప్పిన టీచర్లను శాలువాలు, మెమొంటోలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు స్కూళ్లో వారు చదువుకున్న రోజుల్లో గడిపిన అనుభవాలను తోటి విద్యార్థులతో పంచుకున్నారు. అనంతరం పూర్వ ఉపాధ్యాయులు సుదర్శన్, సత్యనారాయణ, కిషోర్ సింగ్, గణేశ్‌రెడ్డి మాట్లాడుతూ..పూర్వ విద్యార్థులు గురువులను పూర్వ విద్యార్థులను అభినందించారు. పూర్వ విద్యార్థులు లోనే ఉపేందర్, గుంటి శ్రీనివాస్, తాటికాయ యాకయ్య, దీందాల్ సింగ్ శైలేందర్, సింగ్వ వసంత, లక్ష్మి, ఉత్తమ్‌రెడ్డి, వెంకటనారాయణ,సారంగ పాణి ఎస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## పేద మహిళలకు చీరల పంపిణీ

**కోదాడ, విశాల భారతి :** ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల ఆధ్వర్యంలో గాలి రమేశ్ నాయుడు వర్ధంతి సందర్భంగా కోదాడ పట్టణానికి చెందిన 300 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణ యాదవ్, డివిజన్ ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు, షేక్ బాజన్, ఎల్ హెచ్ పి ఎస్ జిల్లా అధ్యక్షుడు భూక్య రవి నాయక్ , రాష్ట్ర మాదిగ అడ్వకేట్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ వేల్పుల మోష మాట్లాడుతూ 34 ఏండ్ల క్రితం గాలి రమేశ్ నాయుడు మిత్రమండలిని స్థాపించి ఆయన పేరు మీద పేద విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, ఎస్సీ, ఎస్టీ మహిళలకు చీరల పంపిణీ, అయ్యప్ప స్వాములకు అన్నదానం, రక్తదాన శిబిరాలను నిర్వహించి అండగా నిలిచారన్నారు. ఆయన పేరు మీద ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పట్టా నాగరాజు, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుధాకర్ గౌడ్, ఎల్ హెచ్ పి ఎస్ కోదాడ నియోజక వర్గ అధ్యక్షుడు బర్మావత్ రాజీవ్, ఎంఐఎం కోదాడ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ రఫీ, సేవాలాల్ రాష్ట్ర కార్యదర్శి బర్మావత్ సీతారాం సింగ్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి వంశీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## రాజీవ్ గాంధీ చిరస్మరణీయుడు

**పెద్ద వంగర, విశాల భారతి :** భారతదేశ మాజీ ప్రధాని, ఐటీ విప్లవానికి ఆద్యుడు రాజీవ్ గాంధీ 79వ జయంతిని పెద్దవంగర మండల కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మద్దసాని సురేశ్ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ ఫొటోకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సురేశ్ మాట్లాడుతూ రాజీవ్ గాంధీ దేశంలో కంప్యూటర్ విద్యను ప్రవేశ పెట్టారని, దేశం కోసం తన ప్రాణాన్ని త్యాగం చేసిన గొప్ప మహనీయుడన్నారు. యువత రాజీవ్ గాంధీ ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు రంగు మురళి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి పొడిశెట్టి సైదులు, ఓరుగంటి సతీష్ , బీసీ సెల్ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు సీతారాం నాయక్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఈదురు సైదులు, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు గద్దల స్వామి యూత్ అధ్యక్షుడు హరికృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ముందస్తు అరెస్టులు సిగ్గుమాలిన చర్య



**మునగాల, విశాల భారతి:** సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆదివారం బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వహిస్తున్న బహిరంగ సభలో కేసీఆర్ ను ప్రశ్నించడానికి వెళ్తున్న పీవైఎల్ లీడర్లను ముందస్తు అరెస్ట్ చేయడం దుర్మార్గమని పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి. రవి విమర్శించారు. నిరుద్యోగ సమస్యలపై పోరాడుతున్న ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) జిల్లా అధ్యక్ష కార్యదర్శులతో పాటు జిల్లా నాయకులను అక్రమ అరెస్టులు చేయడంపై ఆయన మండిపడ్డారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వానికి మద్యం టెండర్ల పై ఉన్న ప్రేమ నిరుద్యోగులపై లేదన్నారు. ఇంకా రెండు నెలలు గడువు ఉండగానే ముందే మద్యం టెండర్లు పిలిచి ఆదాయాన్ని సొమ్ము చేసుకోవడం కోసం ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధ, నిరుద్యోగులపై ఎందుకు లేదని ప్రశ్నించారు. నిరుద్యోగ సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్న కేసీఆర్ ప్రభుత్వాన్ని ఓడించడానికి యువకులు, నిరుద్యోగులు ఏకం కావాలని పిలుపునిచ్చారు. ప్రశ్నించే గొంతులను ముందస్తు అరెస్టులు చేసి ఉద్యమాలను ఆపలేరన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు కనీసం 50,000 ఉద్యోగాలు కూడా భర్తీ చేయకుండా నిరుద్యోగులను ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఎక్కడ మీటింగ్ జరిగినా సీఎం అమలు కాని హామీలు తప్పా.. ఆచరణ శూన్యమన్నారు. ప్రభుత్వం అక్రమ అరెస్టులను ప్రజలు, ప్రజాస్వామిక వాదులు ఖండించాలని రవి పిలుపునిచ్చారు.



## డబుల్ ఇంజిన్ సర్కార్ తో ప్రజలకు లబ్ధి

**కర్ణాటక ఎమ్మెల్యే జోల్లె శశికల**

**బాల్కొండ,విశాలభారతి:** బాల్కొండ నియోజకవర్గం ప్రవాస్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కర్ణాటక రాష్ట్రంలోని నిప్పని నియోజకవర్గం బిజెపి ఎమ్మెల్యే జోల్లె శశికల నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండలంలో పర్యటించారు.పర్యటనలో భాగంగా ముప్కాల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి,పడిలేచిన మర్రి చెట్టు దేవాలయాని ఆమె దర్శించుకున్నారు.అనంతరం పార్టీ కార్యకర్తల మీటింగ్ లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోల్లె శశికల మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో డబల్ ఇంజిన్ సర్కార్ వస్తే రాష్ట్ర ప్రజలకు ఎంతో లబ్ధి చేకూరుతుందన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ తన కుటుంబం కోసమే పనిచేస్తున్నారని విమర్శించారు. బాల్కొండ నియోజకవర్గం ప్రజలంతా ఏకమై రానున్న ఎన్నికల్లో బిజెపి పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు.కార్యకర్తల గోడలకు జోల్లె శశికల కమలం పువ్వు గుర్తును పెయింటింగ్ వేసారు.ముప్కాల్ మండలంలోని పలువురు ప్రముఖులను కలిసి వారికి ప్రధాని నరేంద్రమోడీ పాలన గురించి వివరించి,మద్దతు కోరారు. ముప్కాల్ నుండి మెండోరా వెళ్లే అర్&బి రోడ్డును నాసిరకంగా వేయడంతో పూర్తిగా ధ్వంసమైంది.ఆ రోడ్డును ఆమె పరిశీలించారు. అనంతరం ముప్కాల్ లోని రివర్స్ పంప్ హౌస్ ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏలేటి మల్లికార్జున్ రెడ్డి, పెద్దోళ్ల గంగారెడ్డి, డమంకర్ శ్రీనివాస్,జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్,అసెంబ్లీ కన్వీనర్ మల్కాన్నగారి మోహన్, బిజెపి అధికార ప్రతినిధి ర్యాడ రవీందర్,ముప్కాల్ మండల అధ్యక్షుడు గడ్డం సంతోష్ రెడ్డి,కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ముస్కు నర్సయ్య, నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## వేద స్పెషాలిటీ ఆయుర్వేదిక్ హాస్పటల్ మెడికల్ క్యాంప్

- ప్రారంభించిన మేయర్ జక్క వెంకట్ రెడ్డి.

**మేడిపల్లి,విశాల భారతి:** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 3వ డివిజన్ యందు వేద స్పెషాలిటీ ఆయుర్వేదిక్ హాస్పిటల్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన "ఫ్రీ మెడికల్ క్యాంప్" ను మేయర్ జక్క వెంకట్ రెడ్డి, కార్పొరేటర్ శ్రీమతి బైటింటి శారద ఈశ్వర్ రెడ్డి, నాయకులు ఈశ్వర్ రెడ్డి కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయుర్వేదం పై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉచితంగా మందుల పంపిణీతో పాటు ఆరోగ్య సూత్రాలు, వాటి గురించి అవగాహన, నిత్యజీవితంలో అనుసరించడం ద్వారా కలిగే ఉపయోగాలు, వ్యాధుల నివారణ తదితర అంశాలను వైద్య నిపుణులు ప్రజలకు వివరించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దొంతిరి హరి శంకర్ రెడ్డి, Dr అంజిరెడ్డి MD, డైరెక్టర్ విరాజిత ఎండి పంచకర్మ, Dr శివ MS, వేద మానేజింగ్ డైరెక్టర్ కృష్ణ రెడ్డి, కాలనీ అధ్యక్ష కార్యదర్శులు, కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## మాలలకు రాజకీయ ప్రాధాన్యత ఇవ్వాలి

- లేకుంటే మాలలకు ప్రత్యేక రాజకీయ పార్టీ ఏర్పాటు చేస్తాం
- మాల మహానాడు జాతీయ అధ్యక్షులు గోపోజు రమేష్ బాబు

**ముషీరాబాద్,విశాలభారతి:** మాలలు రాజకీయంగా ఎదగడానికి అన్ని రాజకీయ పార్టీలు ప్రాధన్యత ఇవ్వాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు గోపోజు రమేష్ బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మాల మహానాడు ఆధ్వర్యంలో మాలలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని వివిధ పార్టీ నాయకులతో చర్చ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశాన్ని ఉద్దేశించి రమేష్ బాబు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మాలలకు ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు 10 ఎమ్మెల్యే స్థానాలు రెండు ఎంపీ స్థానాలు ఎస్సీ కులంలోని మాల కులానికి కేటాయించాలన్నారు. మాల కులం నుండి తెలంగాణలో ఒక్క ఎంపీ కూడా లేకపోవడం బాధాకరమని మాలలకు రాజకీయ ప్రాధాన్యత తోపాటు ప్రభుత్వ పదవుల్లోను ప్రాధాన్యత కల్పించాలని కోరారు. లేనిపక్షంలో మాలలకు ప్రత్యేక రాజకీయ పార్టీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో కొండ్ర రాజలింగం, మల్లెల వెంకట్రావు, వల్లిక కృష్ణమూర్తి, నర్సింగరావు, శ్రవణ్ కుమార్, శ్రీధర్ రావు, రాందాస్, కోటేశ్వరరావు, అశోక్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి ట్రైలర్ రిలీజ్



యంగ్ టాలెంటెడ్ హీరో నవీన్ పొలిశెట్టి, స్టార్ హీరోయిన్ అనుష్క శెట్టి జంటగా రూపొందుతోన్న రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' సెప్టెంబర్ 7న రిలీజ్ కాబోతోంది. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ యువీ క్రియేషన్స్ బ్యానర్‌పై మహేష్ బాబు.పి దర్శకత్వంలో వంశీ, ప్రమోద్ నిర్మించారు. ఈ సినిమా ట్రైలర్ ను ఈ నెల 21న రిలీజ్ చేస్తున్నట్లు శనివారం చిత్రబృందం ప్రకటించారు. అనౌన్స్ మెంట్ నుంచి అందరిలో ఆసక్తి కలిగించింది 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' సినిమా. ఈ ఏడాది మోస్ట్ అవేటెడ్ మూవీగా ఉన్న ఈ సినిమా నుంచి ఇప్పటికే రిలీజ్ చేసిన టీజర్, పాటలకు మంచి స్పందన వచ్చింది. శ్రీకృష్ణ జన్మాష్టమి పండుగ సందర్భంగా 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' సెప్టెంబర్ 7న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్ గా రిలీజ్ కాబోతోంది. ఈ సినిమాను థియేటర్ లో ఎంజాయ్ చేసేందుకు ఆడియెన్స్ ఎదురుచూస్తున్నారు.

## గ్రాండ్ గా 184వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు



తెలుగు సినిమాటోగ్రఫీ అసోసియేషన్ ఆధ్వర్యంలో 184వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు హైదరాబాద్ లో గ్రాండ్ గా జరిగాయి. ఈ వేడుకలో ప్రముఖ సినిమాటోగ్రాఫర్స్ ఎస్ గోపాల్ రెడ్డి (లైఫ్ టైమ్ అచీవ్ మెంట్ అవార్డ్), ఛోటా కె. నాయుడు, కె కె సెంథిల్ కుమార్, శరత్, కె రవీంద్రబాబు, సి రామ్ ప్రసాద్, హరి అనుమోలు, రసూల్ ఎల్లోర్ లను ఘనంగా సత్కరించారు. యువ సినిమాటోగ్రాఫర్స్ కార్తిక్ ఘట్టమనేని, ఉదయ్ గుర్రాలని సినిమాటిక్ విజనరీ అవార్డ్స్, సాయి శ్రీరామ్, దాశరధి శివేంద్ర, నగేష్ బ్యానల్, బాల్రెడ్డి, సినిమాటిక్ ఎక్స్ లెన్స్ అవార్డ్స్ తో సత్కరించారు. ఈ వేడుకలో దర్శకులు కోదండరామి రెడ్డి, వివి వినాయక్, ఇంద్రగంటి మోహన్ కృష్ణ, ఏ.ఎస్.రవికుమార్ చౌదరి, సాయి రాజేష్, దామోదర్ ప్రసాద్, రాధకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ వేడుకలో ఎస్ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. పరిశ్రమలో 55 ఏళ్ళు పూర్తి చేసుకున్నాను. 1968లో చెన్నై వీనస్ స్టూడియోలో అప్రంటీస్ గా చేరాను. అంచెలంచెలుగా సినిమాటోగ్రఫర్ అయ్యాను. ఇప్పటికి యాభై ఐదేళ్ళు అయ్యాయి. ఈ రోజు నా మిత్రులందరి ముందు ఈ సత్కారం తీసుకోవడం చాలా ఆనందంగా వుంది. అందరికీ ధన్యవాదాలు'' తెలిపారు. ఛోటా కె. నాయుడు మాట్లాడుతూ.. ఎస్ గోపాల్ రెడ్డి గారిని చూసి ఆయనలా మంచి కెమరామేన్ కావాలని స్ఫూర్తి పొందాను. మన తెలుగులోనే ది బెస్ట్ కెమరామెన్స్ వస్తున్నారు. సరైన అవకాశాలు ఇస్తే అద్భుతాలు చేస్తారు. ఇండియన్ సినిమాని తెలుగు కెమరామెన్ రూల్ చేస్తారనే నమ్మకం వుంది. దీన్ని సవాల్ గా తీసుకొని ముందుకు వెళ్ళాలి'' అన్నారు. సెంథిల్ కుమార్ మాట్లాడుతూ.. కెమరామెన్స్ అందరినీ ఇలా ఒక్కచోట చూడటం ఆనందంగా వుంది. 'ఐతే' సినిమా చేస్తున్నప్పుడు నేను కూడా ఒక బెస్ట్ కెమరామేన్ అవ్వాలని కల కన్నాను. అక్కడి నుంచి ప్రయాణం మొదలైతే.. ఈ రోజు ఒకటికాదు.. రెండు కాదు.. మూడు వెయ్యి కోట్ల సినిమాలు చేశాను. చాలా ఆనందంగా వుంది. బహుసా ఆస్కార్ కమిటీలో వున్న ఇండియన్ టెక్నిషియన్ ని నేను అనుకుంటాను. ఇటివలే ఇన్విటేషన్ వచ్చింది. ఇది ఒక అచీవ్మెంట్ గా భావిస్తున్నా. తెలుగు సినిమా చేస్తే ఏ స్థాయికైనా వెళ్ళొచ్చు అనడానికి ఇది నిదర్శనం'' అన్నారు.



## #AP 31 ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్ రిలీజ్

చంటి, లహరి హీరో హీరోయిన్లుగా అన్నపూర్ణేశ్వరి సినీ క్రియేషన్స్ బ్యానర్ పై రూపొందుతోన్న చిత్రం '#AP 31'. 'నెంబర్ మిస్సింగ్' ట్యాగ్ లైన్. కె.వి.ఆర్ దర్శకత్వంలో నారాయణ స్వామి.ఎం ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సలీమ్ మాలిక్ (మ్యాక్) అడిషనల్ స్క్రీన్ ప్లే అందించారు. ఆదివారం హైదరాబాద్లో జరిగిన ప్రెస్ మీట్లో ప్రముఖ నిర్మాత త్రినాథ రావు నక్కిన మోషన్ పోస్టర్ ను విడుదల చేశారు. ఫస్ట్ లుక్ని ప్రముఖ నిర్మాత బెక్కెం వేణు గోపాల్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో హీరో చంటి, హీరోయిన్ లహరి, దర్శకుడు కె.వి.ఆర్ సహా చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా.. ప్రముఖ డైరెక్టర్ త్రినాథరావు నక్కిన మాట్లాడుతూ "నాది, బెక్కెం వేణు గోపాల్ గారి కెరీర్ స్టార్ట్ అయ్యింది చిన్న సినిమా నుంచే. అప్పట్లో మా సినిమా పోస్టర్, టీజర్, ట్రైలర్ లను ఎవరు రిలీజ్ చేస్తారా? అని ఎదురు చూసే వాళ్లం. ఇప్పుడు పెద్ద సినిమాలు చేస్తున్నామని మా స్టార్టింగ్ కెరీర్ ను మరచిపోకూడదు కదా. అందుకనే ఎవరైనా సపోర్ట్ కావాలని మమ్మల్ని అడిగితే మా వంతు సపోర్ట్ చేయటానికి, ఎంకరేజ్ చేయటానికి మేం ఎప్పుడూ వెనుకాడం. '#AP 31' అనేది వైజాగ్ బండి. ఈ సినిమాను తెలుగు, తమిళంలోనూ విడుదల చేస్తున్నారు. సినిమా మంచి సక్సెస్ కావాలని మన స్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అన్నారు. ప్రముఖ నిర్మాత బెక్కెం వేణు గోపాల్ మాట్లాడుతూ "ప్రతీ ఏడాది ఎంతో మంది కొత్త దర్శకులు, నిర్మాతలు వారి సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. వారిలో కొందరే మట్టిలో మాణిక్యాలుగా వెలుగుతున్నారు. అలాగే '#AP 31' సినిమా డైరెక్టర్, నిర్మాతలు ఇండస్ట్రీలో నిలబడాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం. సినిమా పెద్ద హిట్ అయ్యి.. వారు మరిన్ని సినిమాలు చేయాలని కోరుకుంటున్నాం. " అన్నారు.

## కేతిక శర్మ అందానికి కేరాఫ్ అడ్రస్



ఓ శిల్పి చెక్కిన అందాల శిల్పంలా ఉంటుంది. ఈ బ్యూటీ టాలీవుడ్ కి పరిచయం అయ్యి చాలా కాలమే అవుతుంది. నిజానికి, ఆమె అందానికి ఈపాటికి స్టార్ హీరోయిన్ కావాల్సింది. కానీ, అదృష్టం కలిసిరాక, ఇంకా మంచి హిట్ కోసం ఎదురుచూస్తూనే ఉంది. అందం మాత్రమే కాదు, నటనలోనూ ఈ పాపకు మంచి మార్కులే పడ్డాయి. కానీ, ఇప్పటి వరకు కేతిక చేసిన ఏ సినిమా మంచి హిట్టు అందుకోలేకపోయింది. దీంతో, ఈ బ్యూటీ ఇంకా సక్సెస్ కోసం ఎదురుచూపులతోనే కాలం గడిపేస్తోంది. సినిమా అవకాశాలు ఎలా ఉన్నా, సోషల్ మీడియాలో మాత్రం చాలా చురుకుగా ఉంటుంది. గ్యాప్ లేకుండా, ఫోటోలు షేర్ చేస్తూనే ఉంటుంది. ఆ ఫోటోల్లో ఆమె తన అందాలను చూపిస్తూ, తన ఫాలోవర్స్ ని ఊరిస్తూ ఉంటుంది. తాజాగా కూడా కొన్ని హాట్ ఫోటోలు షేర్ చేసింది. అయితే, ఇవి రీసెంట్ ఫోటోలు కావట. త్రో బ్యాక్ ఫోటోలు. తన తల్లితో కలిసి ఆస్ట్రేలియా వెళ్లినప్పటి ఫోటోలు. ఎప్పటి ఫోటోలు అయితే ఏంటి? ఈ ఫోటోల్లో కేతిక అందాలు చూడటానికి రెండు కళ్లు సరిపోవు అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. బుల్లి డెనిమ్ జీన్స్ స్కర్ట్ , దానిపై టైట్ టీషర్ట్ ధరించింది. ఇక, కెమేరాను విభిన్న యాంగిల్స్ లో పెట్టి ఫోటోలు తీశారు. ఆ ఫోటోలన్నింటినీ షేర్ చేసింది. ఫ్యాన్స్ ఆ ఫోటోలు చూసి పండగ చేసుకుంటున్నారు. ఆ ఫోటోలో చూస్తుంటేనే, తమ ఫోన్ స్క్రీన్ వేడెక్కిపోతోందని కొందరు కామెంట్ చేయగా, బికినీ ఫోటోలు షేర్ చేయవచ్చు కదా అని కొందరు రిక్వెస్ట్ చేస్తున్నారు.

## నచ్చినవాడు నుంచి సాంగ్ రిలీజ్



ఏనుగంటి ఫిల్మ్ జోన్ పతాకం పై లక్ష్మణ్ చిన్నా హీరోగా నటిస్తూ స్వయ దర్శకత్వం వహించిన తొలి చిత్రం "నచ్చినవాడు". సంగీత దర్శకుడు మిజో జోసెఫ్ స్వరపరిచిన 'కదిలే కాలం ఆగిందే' అనే మెలోడీ ప్రేమ గీతని ప్రముఖ గాయకుడు జావేద్ అలీ పాడగా, యువ పాటల రచయిత హర్షవర్ధన్ రెడ్డి రచించారు, ఈ పాటను బి ఆర్ ఎస్ పార్టీ శేరిలింగంపల్లి ఎమ్ ఎల్ ఏ అరికెపూడి గాంధీ గారు విడుదల చేశారు. ఆయన పాట వీక్షించి సినిమా మంచి విజయం సాధించాలి అని కోరుకున్నారు. అనంతరం హీరో, దర్శక నిర్మాత లక్ష్మణ్ చిన్నా మాట్లాడుతూ "నచ్చినవాడు" చిత్రం నుంచి ఈరోజు 'కదిలే కాలం ఆగిందే' అనే మెలోడీ పాటను బి ఆర్ ఎస్ పార్టీ శేరిలింగంపల్లి ఎమ్ ఎల్ ఏ అరికెపూడి గాంధీ గారి చేతుల మీదుగా ఆదిత్య మ్యూజిక్ ద్వారా విడుదల చేసాం. అరికెపూడి గాంధీ గారు పాట చాలా బాగుంది అని సంగీత దర్శకుడు మెజ్జో జోసెఫ్ ని కొనియాడారు. సినిమా మంచి విజయం సాధించాలి అని తన శుభాకాంక్షలు తెలియజేశారు. స్త్రీ సెల్ఫ్ రెస్పెక్ట్ కథాంశంతో నిర్మించబడిన ఈ చిత్రం యూత్, ఫ్యామిలీ ఆడియన్స్ అందరికి నచ్చుతుంది, త్వరలోనే విడుదల చేస్తాం" అని తెలిపారు.

## హాట్ హాట్ లుక్స్‌లో...



తెలుగు తెరపై చాలా సినిమాలు చేసినా, ఇప్పటికీ మంచి హిట్ కోసం ఎదురు చూస్తున్న వారిలో నిధి అగర్వాల్ ఒకరు. ఈ బ్యూటీ టాలీవుడ్ కి పరిచయమై చాలా కాలమే అయ్యిందది. అయినా, ఇప్పటికీ చెప్పకోదగిన హిట్ అంటే, ఒక్క ఇస్మార్ట్ శంకర్ మాత్రమే కనపడుతోంది. ఈ సినిమాలో నటనతో పాటు, అందంతోనూ మెస్మరైజ్ చేసింది. నిధిని తెరపైచూసి చాలా కాలమే అవుతోంది. కానీ, సోషల్ మీడియాలో మాత్రం ఎప్పటికప్పడు తన అందాలను ఆరబోస్తూ, అందరినీ మెస్మరైజ్ చేస్తూ ఉంటుది. తాజాగా కూడా కొన్ని ఫోటోలు షేర్ చేసింది. ఆ ఫోటోలు కుర్రకారును విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. అందమంతా ఇక్కడే ఉందా అనే సందేహం కలిగేలా ఆమె ఫోటోలకు ఫోజులు ఇచ్చింది. బ్లూకలర్ వెల్వెట్ డ్రెస్ లో క్లీవేజ్ అందాలను ఆరబోసింది. ఆ డ్రెస్ కి తనను తాను హైలెట్ చేసుకునేలా, జిగేలుమనే చెవిపోగులు ధరించింది. దీంతో, ఆమె అందం మరింత రెట్టింపు అయ్యింది. కాగా, మజ్నూ సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది అందాల నిధి అగర్వాల్. తెలుగులో అడుగుపెట్టిన మొదటి సినిమాలోనే తన అందాలను ఆరబోయడంలో ఆమె ఎక్కడా వెనకాడలేదు. అంతే, ఆమె సొగసుకు కుర్రకారుకూడా దాసోహం అన్నారు. అరకొర సినిమా ఆఫర్లు వచ్చాయి కానీ, మంచి హిట్ పడక, కెరీర్ లో వెకనపడిపోయింది. కానీ లక్కే లేదు నిధి పూర్తి పేరు నిధి అగర్వాల్ రాగాలహరి. సినిమాల్లోకి రాకముందు మోడల్ గా కూడా రాణించింది.



## చే మూవీ పోస్టర్ లాంచ్

తెలుగు తెరపై మరో బయోపిక్ రాబోతుంది. క్యూబా పోరాటయోధుడు చేగువేరా జీవిత చరిత్ర ఆధారంగా రూపొందుతున్న చిత్రం "చే" లాంగ్ లైవ్ ట్యాగ్ లైన్. క్యూబా తరువాత ప్రపంచం లో తొలిసారి రూపొందుతున్న చేగువేరా బియోపిక్ ఇది. నవ ఉదయం సమర్పణలో నేచర్ ఆర్ట్స్ బ్యానర్ పై బి.ఆర్ సభావత్ నాయక్ టైటిల్ రోల్ పోషిస్తూ, దర్శకత్వం వహిస్తున్నారు. సూర్య, బాబు, దేవేంద్ర సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ మూవీలో లావణ్య సమీరా, పూల సిద్దేశ్వర్, కార్తీక్ నూనె, వినోద్ , పసల ఉమా మహేశ్వర్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. రవిశంకర్ సంగీతం అందిస్తున్నారు. షూటింగ్ పూర్తిచేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంటున్న ఈ మూవీ పోస్టర్ ను చేగువేరా కూతురు డాక్టర్ అలైదా గువేరా లాంచ్ చేసి చిత్రయూనిట్ ను అభినందించారు.. అనంతరం హీరో , దర్శకుడు బి.ఆర్ సభావత్ నాయక్ మాట్లాడుతూ... "విప్లవ వీరుడు , యువత స్ఫూర్తిదాయకుడు చేగువేరా జీవిత చరిత్రను సినిమా గా తీయడం చాలా గర్వంగా ఫీల్ అవుతున్నాము.. ఆయన చేసిన పోరాటలు, త్యాగాలు ఈ చిత్రంలో తీశాము. అప్పటి పరిస్థితులకు అద్దం పట్టే విధంగా చాలా జాగ్రత్తలు తీసుకుని, ఎక్కడ కాంప్రమైజ్ కాకుండా ఈ సినిమా ను రూపోందించాం" అని చెప్పారు. "ఈ మూవీ పోస్టర్ ను చేగువేరా కూతురు డా.అలైదా గువేరా విడుదల చేయ్యడం అదృష్టంగా భావిస్తున్నాం. పోస్ట్ ప్రొడక్షన్ పూర్తికాగానే...త్వరలో సినిమా టీజర్ ,ట్రైలర్ రిలీజ్ చేసి విడుదల తేదిని అనౌన్స్ చేస్తాం" అని తెలిపారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.